ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 17, 2005

వార్తా పత్రికల విస్ఫోటనం

హ్యాపీబర్త్‌డే

17.4.2005నుంచి
23.4.2005వరుచి

శ్వేత
5సం॥,17.4.2000
పద్మావతి-శ్రీనివాసులు
మంగళకాలనీ-అనంతపురం

అమన్ అన్సార్
1సం॥,17.4.2004
నఫీస్ ఫాతీమ-కమురుద్దీన్
ముత్తంగి-మెదక్

శివప్రసాద్
ఏప్రిల్-17
ధనలక్ష్మి-వెంకన్న
వట్టిమర్తి-నల్లగొండ

అల్తాఫ్ హుస్సేన్
4సం॥,17.4.2001
నసీమ్ బేగం-తాజుద్దీన్
అమరచింత-మ॥నగర్

సుచిత్‌రెడ్డి
1సం॥,17.4.2004
గీత-మల్లారెడ్డి
గ్రీన్‌హిల్స్‌కాలనీ-హైదరాబాద్

గాయత్రి
4సం॥,18.4.2001
శ్రీదేవి-వీరారెడ్డి
పెద్దరవీడు-ప్రకాశం

సంతోషి(సౌమ్య)
4సం॥,19.4.2001
రజని-మురళి
తిరువూరు-కృష్ణా

శివరంజని
2సం॥, 19.4.2003
ఉమాదేవి-వెంకటేష్
న్యూశాంతినగర్-రంగారెడ్డి

తిరుమల నాయక్
5సం॥,20.4.2000
సరోజ-నందునాయక్
రామంతపూర్-హైదరాబాద్

దీపిక
4సం॥, 20.4.2001
మల్లారెడ్డి
నల్లగొండ

ఆశ్రిత
1సం॥, 21.4.2004
రమాప్రసన్న-భానుమూర్తి
తాడేపల్లిగూడెం-ప॥గో

కోదండరాం
6సం॥, 21.4.1999
రాజ్యలక్ష్మి-రామారావు
చీరాల-ప్రకాశం

చంద్రిక
1సం॥, 23.4.2004
హరిత-రవీందర్‌రెడ్డి
నర్సింహులపేట-వరంగల్

తేజ
1సం॥, ఏప్రిల్-2004
వెంకటమ్మ-బాలవీరు
బొల్లారం-మ॥నగర్

గురుచరణ్
3సం॥, ఏప్రిల్-2002
భాగ్యలక్ష్మి-శ్రీశైలం
గోల్‌నాక-హైదరాబాద్

రవిచంద్ర
10సం॥,ఏప్రిల్-1995
రమ-శ్రీనివాసరావు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

రోహిత్(టింకు)
4సం॥,ఏప్రిల్-2001
రమాదేవి-శ్రీనివాసులు
రాచూరు-మ॥నగర్

డి.ప్రియాంక
4సం॥, ఏప్రిల్-2001
లలిత-లెనిన్
చౌదరిపల్లి-మ॥నగర్

శ్వేత
8సం॥,ఏప్రిల్-1997
ఇందిర-ప్రకాష్
పోలేపల్లి-మ॥నగర్

తస్లీమాబేగం
4సం॥, ఏప్రిల్-2001
సుల్తానాబేగం-సయ్యద్‌ఖాదర్

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

లేసుల అల్లిక

3వతేదీ ఆదివారం కవర్‌స్టోరీ బాగుంది. వ్యాపకంగా మొదలైన అందమైన హస్తకళ లేసుల అల్లిక, పరిశ్రమగా మారి, గోదావరి జిల్లాని అంతర్జాతీయ వాణిజ్యకేంద్రంగా చేసుకున్న విధం బాగా వివరించారు. సంక్షోభం నివారింపబడాలని ఆశిద్దాం.

'మనలోమాట' పైశాచికానందలహరుల నెత్తిన మొట్టికాయలాగ ఉంది.

'రెప్పలచప్పుడు' పుస్తక పరిచయం చదివింపజేసిదిగా ఉంది.

ఎస్.కె. జహంగీర్

నెల్లూరుజిల్లా



రాఖీకట్టినంతనే...?!

కథ నా హృదయాన్ని కదిలించింది. రాఖీకట్టినంతనే...?! కథ మీడిల్ క్లాస్ జీవితానికి అద్దంపట్టే విధంగా ఉంది. మమత, మమత తల్లి, అవినాష్ క్యారెక్టరైజేషన్ బావున్నది. టూరిస్ట్‌గైడ్, రుచి, ఆరోగ్యం, న్యాయసలహాలు, జీవనశైలి, ఔరా, కవర్‌స్టోరీ, కళాసాహితి, కథ అన్నీ బాగున్నాయి.

- కలకొండ ప్రభాకర్, నల్గొండ.



మనలో మాట

మనలోమాట "ఆటాడుకుందాం"లో పోట్లాడుకుందాం అంటే బాగోదుగాని... అంటూ ప్రారంభించి బాంబులు కంటే బంతులు అమ్మితే బాగుండు. బాకులూ బల్లేల కంటే బ్యాటులు కొనుక్కోవడంమేలు అన్నది! యోచించదగ్గదిగా వుంది. కార్టూన్ కదంబంలో "గడ్డి దొరకనట్టుందిసార్, పశుగ్రాసంలెక్కల కాగితాలు లాక్కుతింటోంది" అన్నది నడుస్తున్న వ్యవస్థకు అద్దం పట్టింది.

సిరిపురపు రామకోటేశ్వరరావు,

ఎనికేపాడు.

ఇంతి సంగతులు

నేను ఒక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేయుచున్నాను. నేను తోటి ఉద్యోగినులందరం మీ పత్రిక ఆదివారం అనుబంధంలో "ఇంతిసంగతులు"లో ప్రచురితమయ్యే రచనలను చాలా శ్రద్ధగా, ఉత్సాహంగా చదువుతాము. ఎందుకంటే వాటిలో హాస్యము, సందేశము మిళితమై ఉంటాయి.

"నువ్వో సగం నేనో సగం సరేనా" అను శీర్షిక మనసులకు హత్తుకు పోయేదిగా ముఖ్యంగా ఆధునిక మహిళా ఉద్యోగిని మనసుకు హత్తుకుపోయేలా ఉంది. కానీ ఈ వారం ఆదివారం అనుబంధం మమ్మల్నెంతో నిరుత్సాహపరిచింది. ఇంతి సంగతులు ప్రచురితం కాలేదు. కావున ఈ శీర్షికలో రచనలు మీరు ప్రతీవారం వేయాలని కోరుతున్నాము.

సి. హెచ్. సీత, ఖమ్మం.

రియల్ స్టోరీ

"వైద్యుడే దేవుడు" అనే వ్యాసం నన్ను కలువరింపజేసింది. ఈ రోజుల్లో డాక్టర్ వృత్తికి ద్రోహం చేసే వారు ఎందరో వున్నారు. వారు భోగభాగ్యాలు అనుభవిస్తూన్నారే తప్ప. సరియైన న్యాయం చేయలేని పరిస్థితి నేడు ఏర్పడింది. నడవలేని స్థితిలో కూడా వైద్యం చేయడమంటే ఎంతో గర్వకారణం 'డాక్టర్ మోహన్‌కుమార్'గారు అతని చిన్నతనం లక్ష్యం నెరవేరినప్పటికి దురదృష్టవశాత్తు అనారోగ్యం పాలైనాడు. అయినప్పటికి వైద్య విధులను నిర్వహించి పట్టుదలతో పేషెంటులను బతికించాలనే తపన, ఈయన చేస్తున్న కృషి అభినందనీయం. ప్రతిఒక వ్యక్తికి లక్ష్యం అనేది వుంటే కచ్చితంగా గమ్యం చేరగలడు.

-యాటల సోమన్న,

పాలకుర్తి, వరంగల్ జిల్లా

కళాసాహితి

కళాసాహితి శీర్షికలో "ఆపరేషన్ ఫ్లాష్" నాటకం బావున్నది. ఇరాక్‌లో అమెరికా దురాగతాలపై ఈ నాటిక అర్థవంతంగా ఉన్నది. ట్రావెలాగ్‌లో చైనా దేశాన్ని గురించిన వ్యాసం బావున్నది. కవర్‌స్టోరీగా లేసుల అల్లికను గురించిన వివరణాత్మకమైన వ్యాసం ఆసక్తికరంగా ఉన్నది. అంతేగాక ప్రతివారం మీరందిస్తున్న కార్టూన్ కదంబం సామాజిక, రాజకీయ అంశాలపై నవ్వు పుట్టించే విధంగా ఉన్నాయి.

పొట్లపల్లి మహేశ్‌బాబు,

ఎల్లూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

ఎంత చెట్టు... ఎంత గాలి...?!

"ఎంత చెట్టుకి అంత గాలి" అన్నారుగానీ... ఎంత గాలికి అంత చెట్టు అనలేదు. అనరు కూడా.

బుద్ధున్నవారెవరైనా...ఈ లోకం గురించి, లోకంలో బతుకులు గురించి తెలిసినవారెవరైనా ఎంత చెట్టుకి అంత గాలి అనే అంటారని మీకూ తెలుసుకదా!

మన రామారావున్నాడనుకోండి...అతగాడి జీతం గీతం నాతం అన్నీ కలుపుకుని నెలకో పదివేలుకి మించి లేవు...రావూ అనుకున్నప్పుడు అతనుగానీ అతగాడి ఇల్లాలుగానీ అంతకుమించి నెలవారీ ఖర్చు పద్దులనుకోరు. అనుకున్నారో...కొంప కొల్లేరే! ఎంత చెట్టుకి అంత గాలి మరి!

మన ఊరి టీము పొరుగూరి టీముతో చెడుగుడు పందెం కాసిందనుకోండి. ఎవరి ఆటతీరును బట్టి వారి గెలుపుంటుంది. కానీ ఎప్పుడూ నేనకున్నవాళ్ళే గెలిచితీరాలి...పొరుగూరి టీమ్ గెలిచిందో ఊర్కోను అంటే కుదురుతుందా?! చెడుగుడేంటి...క్రికెట్టు ఆటకూడా అంతే మరి. ఎంత చెట్టుకంతే గాలి కదా!

మన రామారావు ఇల్లయినా, ఆ ఇల్లున్న దేశం అయినా "రాబడి సంగతి రాముడెరుగు నా సరదాలు నాకు తీరితే చాలు" అన్నట్లుంటే...అప్పుల కుప్పల తిప్పల బాదరాబందీ అయిపోయి గాలి కొద్దీ చెట్టులా సామెత అల్లల్లాడదూ మరి!

ఇంటయినా బయటయినా పద్ధతి పద్ధతేకదా!

అంచేత...

ఎంత గాలికి అంత చెట్టు అన్నట్టు పరిస్థితి తారుమారు అయిందో...ఆ గాలికి సునామీ బుద్ధిపుట్టిందో... మన పుట్టి మునిగినట్టే.

✿

ఈ సంచికలో . . .

ఓరా! ... 3
కార్టూన్ కదంబం... ... 4
కవర్ స్టోరీ ... 5
జీవనశైలి ... 10
బాలల కథ ... 11
బాలనేస్తాలు ... 12
ఇంతి సంగతి ... 16
నువ్వొద్ది ... 17
ఆరోగ్యం ... 18
పుస్తక పరిచయం ... 21
న్యాయసలహాలు ... 24

ఇంకా...

వర్షం కురిసిన రాత్రి

కథ ... 8, 9

ఇంజనీర్ అయిన పేపర్‌బాయ్

రియల్ స్టోరీ ... 14, 15

వాడపల్లి వెంకన్న ఆలయం

టూరిస్ట్‌గైడ్ . . . 21

సురభి నాటకోత్సవాలు

కళాసాహితి . . . 22, 23

'సిమ్'ప్లీ చీటింగ్!

ప్లాస్టిక్ కరెన్సీ వచ్చాక డబ్బులు దాచుకునే కష్టం తేలికైంది అని మహా సంబరపడ్డారు కదా! కానీ ఆ ప్లాస్టిక్కు ముక్కలకు క్లోనింగ్ బెడదొచ్చిపడింది. ఈమధ్య ఫోన్‌లవాళ్ళు ఓ అధునాతన సౌకర్యం పేరిట సిమ్ కార్డుల పద్ధతి పెట్టారు. ముందస్తు చెల్లింపు కార్డు, తదనంతర చెల్లింపు కార్డులని పలువిధంబుల్లున్నాయిలెండి. అలాంటి సిమ్ కార్డులను కంప్యూటరీ మాయాజాలకులిద్దరు వాటికి నకలు కార్డులను పుట్టించారు. వాటితో ఒకే నంబరుమీద రెండేసి మూడేసి ఫోన్‌లు నడుపుతున్నారు. బిల్లు మాత్రం డిపార్టుమెంటు వారు ఎవరికి నెంబర్ కేటాయించారో ఆయనకే వడ్డించుతారు కదా! ఫోన్ ఎవడిదో-ఎవరికో... బిల్లు మాత్రం డిపార్ట్‌మెంట్ లిస్టులో వారికి! "క్లోనింగ్ పద్ధతి మనుషులకేనా సిమ్ కార్డులకూడా" అని కటకటాల వెనెక్కి చేరిన ఢిల్లీవాలా ప్రేమ్‌స్వరూప్ వహూజా, వినోద్ చౌబేలు అనుకున్నారు పాపం!

"సాంబారు టాబ్లెట్, కిచిడీ క్యాప్సిల్ రెడీ సార్!"

ఈ డైలాగ్ వింటే మనకు ఓ ఐదారేళ్ల క్రితమొచ్చిన సినిమా గుర్తొస్తుంది కదూ...కానీ ఇది నిజంగా నిజ్జమండీ! ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో రెడీ టూ ఈట్‌లు తింటూ కూర్చుంటే ఇంకా 'ఫాస్ట్' అనేదానికి అర్ధమేముంది?! అందుకేనేమో రెడీ టూ ఈట్ తిండిని నడుస్తూ...పరుగెడుతూ తింటూ ఫాస్ట్ ఫాస్ట్ అంటున్నారు. ఇటీవల మరింత ఫాస్ట్ ఇంకా ఫాస్ట్ అయ్యింది. మైసూరులో ఉన్న డిఫెన్స్ ఫుడ్ రిసెర్చ్ లాబరోటరీ మహాశయులు తిండి టానిక్కులు, పిండివంటల క్యాప్సిళ్ళు, బిర్యానీ టాబ్లెట్లు తయారుచేశారుట. కంటికి నదరుగా కనబడకుండా గుటుక్కుని మింగుటెట్లో వీరభక్త భోజనపరులకు మింగుడుపడ్డంలేదు మరి!!!

రాయబారి గేద

భారత్-పాక్‌ల మధ్య స్నేహవారధి నిర్మించేందుకు శతకోటి ప్రయత్నాలు ఇరుదేశాల ప్రజలు చేస్తూనే ఉన్నారు. ఎటొచ్చీ పాలకులే ఇటీవల చేయకతప్పలేదు. ఏమైతేనేం...అంతా మన మంచికే. క్రికెట్ రాయబారం, బస్సు రాయబారం చూశాం కదా. ఇప్పుడు గేదె-దూడల రాయబారం చూస్తున్నాం. మాజీ ముఖ్యమంత్రి ఓమ్ ప్రకాష్ చౌతాలా గారు పాకిస్తాన్‌లో ఉన్న తన స్నేహితుడికి బహుమానంగా గేదెను పంపారు. ఇరుదేశాల సరిహద్దు గ్రామాలలో పశుసంపద-బహుమతీప్రదానం శుభప్రదమైనదనే సాంప్రదాయం ఉందికదా! ఆ గ్రామీణవిలువలన్నా కుళ్ళురాజకీయాలను మించిన సుహృద్భావాన్ని నెలకొల్పితే బాగుండు!

కార్టూన్ కదంబం



మీరు పనికిరారు రిటైర్మెంట్ తీసుకోవాలి
బిజెపి వృద్ధులు తప్పుకోవాలి
— ఆరెస్సెస్ వృద్ధనేత సలహా



కరువు
నీటియెద్దడి
నక్సలిజం
ఉపాధి కొరత
ప్రజాపథం
నారు



మీరు జోస్యం చెప్పినప్పట్నించీ ఇదే తంతు పంతులు గారూ...
2006 లో చక్రం తిప్పనున్న చంద్రబాబు!
— సిద్ధాంతులు

వార్తా పత్రికల విస్ఫోటనం

నాగసూరి వేణుగోపాల్

మొన్నామధ్య చానెళ్ళ వెల్లువ! ఇక ప్రచురణారంగం కనుమరుగవుతుందా అన్నంత మిరుమిట్లుగొల్పింది. సరిగ్గా దానికి భిన్నంగా యిపుడు వార్తాపత్రికల విస్ఫోటనం!! చిన్న తెరపై కనబడీ వినబడీ... ఆ మరుక్షణమే కనుమరుగయ్యే మీడియా ముందు ప్రచురించిన అక్షరం ధీరోదాత్తగా నిలబడ్డంతో ప్రింట్ మీడియా అస్థిత్వానికేం ధోకా లేదని రుజువైంది. అంతేకాదు...అదే ప్రింట్‌మీడియాలో ఒక ప్రఛ్ఛన్న యుద్ధం నెలకొంది. టీవీమీడియా కూడా పత్రికారంగంలోకి దూసుకువస్తోంది. ఈ ఏప్రిల్, మే నెలలు చెన్నయ్, ముంబయి, కొల్‌కతా మహానగరాల్లో వార్తాపత్రికల విస్ఫోటనం జరుగుతోంది.

ప్రతి పత్రికా సామ్రాజ్యం ఇపుడొక యుద్ధభూమి! మన రాజ్యంలో మనం వుందాం అనేది పాత నియమం! కొత్త సామ్రాజ్యంలో ప్రవేశించి విజయపతాక లెగరేద్దాం అనేది కొత్త సూత్రం! ఇది కేవలం ఢిల్లీకే పరిమితం కాలేదు. తిరునల్వేలి నుంచి జమ్ము కాశ్మీరు దాకా, ఇటు కలకత్తా నుంచి అటు అహమ్మదాబాదు దాకా! అలాగే ఇది కేవలం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కే పరిమితం కాలేదు. యుద్ధంలో తలపడుతున్న పత్రికల జాబితా చాలా పెద్దగా వుంది! పత్రికలు ఎడిషన్లు పెంచడంలోగానీ, కొత్త పత్రికలు రావడంలో.గాని దాదాపు వెయ్యికోట్ల రూపాయిలు ఖర్చు అవ్వబోతోందని ఒక అంచనా! హైదరాబాదు ఆంగ్లదినపత్రిక 'డెక్కన్ క్రానికల్' 50కోట్ల రూపాయిల వ్యయంతో చెన్నయ్, తిరునల్వేలి, కోయంబత్తూరు, భువనేశ్వర్‌లలో ఎడిషన్లు ప్రారంభిస్తోంది. చెన్నయ్ ఎడిషన్ ప్రారంభమయ్యింది. తమిళ ఉగాదికి 'టైమ్స్ ఆఫ్ ఇండియా' చెన్నయ్ ఎడిషన్ ప్రారంభిస్తోంది. అలాగే టైమ్స్ ఆఫ్ ఇండియా ముంబైలో రెండవ ఆంగ్ల దినపత్రిక 'టైమ్స్ ఇండిపెండెంట్'ను ప్రారంభిస్తోంది. దీనికి సంబంధించి టైమ్స్ దాదాపు 150 కోట్లు ఖర్చు పెడుతోంది. 'హిందూస్థాన్ టైమ్స్' 176 కోట్ల వ్యయంతో ముంబై, చెన్నయ్ ఎడిషన్లు మొదలుపెడుతోంది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' 200 కోట్ల వ్యయంతో కలకత్తా, భోపాల్, జైపూర్ ఎడిషన్లు ప్రారంభించడమేకాక మరాఠీ దినపత్రిక 'లోక్‌సత్తా,' ఆర్థిక దినపత్రిక 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' ను బలోపేతం చేస్తోంది.

19 లక్షల ప్రతులతో దేశంలోనే అగ్రస్థానంలో వుండే హిందీ దినపత్రిక "దైనిక్ జాగారణ్" తన తాజా ఎడిషన్ బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో యిటీవల ప్రారంభించింది. తర్వాత తన 27వ ఎడిషన్ జమ్మూ కాశ్మీర్‌లో ప్రారంభిస్తోంది. మరో పెద్ద హిందీ దినపత్రిక 'దైనిక్ భాస్కర్' జీ-టెలివిజన్‌తో కలిసి త్వరలో బొంబాయినుంచి "డి.యన్.ఏ" అనే ఆంగ్ల దినపత్రికను, యితరప్రాంతాల నుంచి యితర భాషా పత్రికలను తెస్తోంది. సన్ టీవీ వారు ఇంగ్లీషు దినపత్రికనో లేదా తెలుగు దినపత్రికనో తెస్తున్నట్టు ఆ మధ్య సంచలనం కల్గించారు. ఆంధ్రప్రదేశ్‌లో 'ఉదయం' మరలా చాలా ఎడిషన్లతో రాబోతోందని కలకలం వుంది. ప్రణయ్‌రాయ్ ఎన్‌డిటీవీ వార్తాపత్రికల వైపు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. 'అవుట్‌లుక్' పత్రిక మరో

మూడు పిరియాడికల్స్‌ను తెస్తోంది. 'వికటన్' తమిళ పత్రికా సంస్థ మరో పత్రిక మొదలెడుతోంది. 'మళయాళ మనోరమ' 80 కోట్ల వ్యయంతో అచ్చుయంత్రాలను ఆధునీకరించడం, విస్తరించడం చేస్తోంది. ఇదంతా పరిశీలిస్తే 'వార్తాపత్రికల విస్ఫోటనం' అనిపించడం లేదా?

1977 తర్వాత అంటే అత్యవసర పరిస్థితి తర్వాత భాషా పత్రికలు బాగా పెరిగాయనేది ఒక పరిశీలన. టీవీ మీడియా ప్రారంభదశాబ్దంలో పత్రికలకు ప్రకటనల రాబడిలో 70శాతం నుంచి 50 శాతం కంటే తక్కువస్థాయికి పడిపోయిందని కూడా చెబుతున్నారు. దీనికి కారణం టీవీ, కేబుల్, సినిమా వగైరా మాధ్యమాలు కారణం. అంతే కానీ వృద్ధి, విస్తరించడం, మరింత సంపాదించడం అనే వ్యాపార ప్రాథమిక సూత్రాలు యిక్కడ పనిచేయడం లేదని కూడా అనడం విశేషం.

టైమ్స్ ఆఫ్ ఇండియా - పేపర్ టైగర్

'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఎవరినీ పడగొట్టలేదు. కానీ, భయం మాత్రం తక్కువలేదు- ఇది 'దైనిక భాస్కర్' డైరెక్టర్ గిరీష్ అగర్వాల్ గారి వ్యాఖ్యానం. నిజమే. ఢిల్లీలో 1990 ప్రాంతంలో రేట్లు తగ్గించి హోరాహోరీగా పోటీకి దిగాడు. అయినా ఢిల్లీలో అగ్రస్థానం హిందూస్థాన్ టైమ్స్‌దే! బెంగళూరులో టైమ్స్‌ది అగ్రస్థానం కాదు. ఇటీవల హైదరాబాదులో ప్రవేశించిన టైమ్స్ ఆఫ్ ఇండియా, డెక్కన్ క్రానికల్‌ను దెబ్బతీయలేకపోయింది. అట్లని టైమ్స్ ఆఫ్ ఇండియా, ప్రత్యర్థులను రక్తసిక్తం చేయడం తప్ప సాధించింది ఏమీ లేదా? బొంబాయికే పరిమితం కాకుండా ఢిల్లీ, కలకత్తా నగరాల్లో ప్రవేశించి 18.8 లక్షల సర్క్యులేషన్‌తో ఆంగ్లపత్రికలలో అగ్రస్థానంలో వుంది. ఢిల్లీలో టైమ్స్ ఆఫ్ ఇండియా రేట్లు తగ్గించడం వంటి చర్యల తర్వాత ఆంగ్ల పత్రికల సర్క్యులేషన్ ఢిల్లీలో రెట్టింపు కావడం విశేషం. అనైతికం, నైతికం అనే విషయాల చర్చలో లేకుండా మాట్లాడితే "టైమ్స్ ఆఫ్ ఇండియాది విజయమే!" ఇతరులు కూడా టైమ్స్ ఆఫ్

సర్క్యులేషన్ చుట్టూ పత్రికలు



ఇన్ని పత్రికలు యిన్నిచోట్ల ఎడిషన్లు పెడుతున్నాయి కదా... పాఠకేయులకూ, సంపాదకులకూ గిరాకీ పెరిగిందా? ఈ ప్రశ్న సహజమే! తమాషా ఏమంటే పత్రికారంగం విస్తృతి గురించి చెబుతున్నపుడు ఆ ఒక్క విషయం తప్పా మిగతా విషయాలు ఎక్కువగా చర్చింపబడుతున్నాయి. మరి ఎవరు ప్రధానమైపోయారు? మీకు ఆశ్చర్యం కల్గుతుంది! ఇంటింటికీ పేపర్లేసే కుర్రాళ్ళు, వీధుల్లో పత్రికలు అమ్మే కుర్రాళ్ళు! వీరి వెంట పత్రికలు పోవడం రివాజు. ఒక్క బొంబాయిలో యిటువంటి పేపర్‌బాయిలు పదివేలమంది పైనే వుంటారని అంచనా! 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కొనేవారి అడ్రసు చెబితే, ప్రతి అడ్రసుకు ఐదు రూపాయలు 'హిందూస్థాన్ టైమ్స్' యివ్వజూపుతున్నట్టు వార్తలు వచ్చాయి. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వీరి కోసం ఇన్స్యూరెన్స్ స్కీం ప్రవేశపెడుతున్నట్టు ప్రకటన. అదే చెన్నైయ్‌లో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేపరు కుర్రాళ్ళ ఫోటోలు, పుట్టినరోజులు, పెళ్లిరోజులు వగైరా సేకరించి డేటా బేస్‌లో చేరుస్తోంది. చెన్నయ్‌లో 2000 మంది పేపరు కుర్రాళ్ళు వున్నట్టు, వారందరికీ ఐడెండిటీ కార్డులు యిస్తున్నట్టు వార్తలు. వారికి మరిన్ని పథకాలు వస్తున్నట్టు ఊరిస్తున్నారు. అలాగే ప్రకటనలు సేకరించే వారి జీతాలు కూడా తదనుగుణంగా పెరుగుతున్నట్లు సమాచారం!

ఇండియా నుండి స్ఫూర్తి పొందారు అని చెప్పుకోవాలి. 'దైనిక్ భాస్కర్' అనే హిందీ పత్రిక కూడా రేట్లు తగ్గించడం వంటి చమత్కారాలు చేసి జైపూర్, హర్యానా, చండీఘర్ వంటి చోట్ల రాణించింది. గతంలో చండీఘర్ ఇంగ్లీషు నగరంగా పిలిచేవారు. తర్వాత 'హిందూస్థాన్ టైమ్స్' చండీఘర్ నుంచి ఎడిషన్ ప్రారంభించింది. 'దైనిక భాస్కర్' అంతటితో ఆగక గుజరాత్‌లో 2003లో ప్రవేశించింది. కేవలం ఒకే ఒక సంవత్సరంలో వారి గుజరాత్ పత్రిక 'దివ్యభాస్కర్' అత్యధిక సర్క్యులేషన్ పత్రికగా నిలిచింది. ఈ ఊపు యింతటితో ఆగక జీ-టీవీ తో కలసి బొంబాయి నుంచి ఆంగ్ల దినపత్రికతో వస్తున్నారు. ఆ పత్రిక పేరుకూడా "డి.ఎన్.ఏ" అంటున్నారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రేట్ల తగ్గింపు వ్యూహం అన్ని పత్రికల సర్క్యులేషన్‌కీ తోడ్పడిందని 'దైనిక్ జాగారణ్' మేనేజింగ్ ఎడిటర్ మహేంద్రమోహన్ గుప్తా అంటున్నారు.

చెన్నయ్-ముంబయి-కొల్‌కతాలలో పత్రికల హవా

'డెక్కన్ క్రానికల్' చెన్నయ్ వెడుతోంది! 'దైనిక్ భాస్కర్' గుజరాత్ వెళ్ళింది! హిందూస్థాన్ టైమ్స్ ముంబై వస్తోంది! ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కలకత్తా వెడుతోంది! ఈ ప్రయాణంలో పదనిసలు ఏమిటి? హిందూ, దైనిక్ భాస్కర్ వంటి పత్రికలు అలా సాగుతున్నాయి. ఈ హడావుడి మొదలయ్యాక పత్రికలు అన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. ఎక్కడయితే నెంబర్1, నెంబర్2 పత్రికలకు సర్క్యులేషన్ తేడా ఎక్కువ వుంటే, అక్కడ ప్రవేశించవచ్చునని ఒక ప్రాథమిక సూత్రం. 'సన్ నెట్‌వర్క్' కళానిధి మారన్ యిది వివరిస్తూ తెలుగు దినపత్రికతో తాము ప్రవేశించినా ఆశ్చర్యం లేదని రెండేళ్ళ క్రితం

కోర్టులకెక్కిన హోర్డింగ్ బాక్సింగ్‌లు

వాణిజ్య రాజధాని ముంబయిలో వార్తాపత్రికల "వార్", అడ్వర్‌టైజ్‌మెంట్‌లో నెలకొన్న పోటీ కోర్టు గడపలకెక్కింది. 'దైనిక్ భాస్కర్' పత్రిక ఒక కాన్సెప్ట్‌తో 'ఇట్ ఈజ్ ఇన్ యువర్ డిఎన్ఏ' అనే ప్రకటనను రూపొందించుకుని కోట్లాది రూపాయిల ఖర్చుతో హోర్డింగులు పెట్టుకుంది. దానిని కాపీ కొడుతూ బెన్నట్ కోల్‌మెన్ వారు తమ 'మహారాష్ట్ర టైమ్స్' పత్రిక, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌వారి 'లోక్‌సత్తా' పత్రిక హోర్డింగ్‌లు పెట్టాయి. దీనిపై దైనిక్ భాస్కర్ అగర్వాల్ మహారాష్ట్ర టైమ్స్‌మీద మాత్రమే కోర్టులో కేసు వేశారు.

ప్రకటించారు. అలాగే చెన్నయ్‌లో 'హిందూ' సర్క్యులేషన్ దాదాపు రెండున్నర లక్షలుండగా, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సర్క్యులేషన్ యాభై వేలుకంటే తక్కువని తాజా 'ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్' సంఖ్యలు చెబుతున్నాయి. అందువల్లనే యిపుడు చెన్నయ్‌లోకి డెక్కన్ క్రానికల్, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్థాన్ టైమ్స్ ప్రవేశిస్తున్నాయని మనం చెప్పుకోవాలి. తర్వాత సూత్రం ఏమంటే - అగ్రస్థానంలో వుండే పత్రిక ఎక్కడయితే అప్రమత్తంగా లేదో లేక రెండవ స్థానంలో వుండి పత్రిక బలహీనంగా వుందో - అక్కడ కొత్తగా ప్రవేశించే వీలు చాలా వుంది. ఒక వారం క్రితం ఒకరి పత్రికలోని జర్నలిస్టులకు మరొకరు పెద్దఎత్తున ఇంటర్వ్యూలు నిర్వహించారు. 'డీఎన్ఏ' అనే పత్రిక పెట్టబోతున్న దైనిక్‌భాస్కర్ గ్రూప్, 'బొంబయి మిర్రర్' పత్రిక పెట్టబోతున్న బెన్నెట్, కోల్‌మెన్ & కో గ్రూప్, 'మిడ్ డే' పత్రిక గ్రూప్‌వారు జర్నలిస్టులకోసం పోటీపడుతున్నారు. ది హిందుస్తాన్ టైమ్స్ ఆఫ్ ఇండియా వారు ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తే, టైమ్స్ ఆఫ్ ఇండియా వారు తమ బిల్డింగ్‌లోనే వందలాదిమంది జర్నలిస్టులకు అనేక ఆకర్షణలతో తమ సంస్థల్లోకి లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ముంబయి మార్కెట్లో ప్రకటనల రాబడి

భారతదేశంలోనే ముంబయి అడ్వర్‌టైజ్‌మెంట్ మార్కెట్టు అతిపెద్దది. దేశరాజధాని ఢిల్లీ కూడా ఆ విషయంలో రెండవస్థానంలోనే ఉంది.

ఇంగ్లీషు పత్రికలకు	568.50కోట్లు(70శాతం)
ప్రాంతీయభాషా పత్రికలకు	246.50కోట్లు(30శాతం)
మొత్తం ఆదాయం	**815.00 కోట్లు**

వార్తాపత్రికలకు	717.20కోట్లు(88శాతం)
మ్యాగజైన్లకు	97.80కోట్లు(12శాతం)

ది టైమ్స్ ఆఫ్ ఇండియా	404.40కోట్లు
మిడ్ డే	35.60కోట్లు
ఇండియన్ ఎక్స్‌ప్రెస్	25.40కోట్లు
ఆసియన్ ఏజ్	7.50కోట్లు
ఆఫ్టర్‌నూన్ డిస్పాచ్&కొరియర్	2.80కోట్లు

(బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ప్రచురించిన మీడియా డైరెక్షన్ అంచనాలు)

ఇపుడే ఎందుకు?

గత పది, పదిహేనేళ్ళుగా పత్రికారంగం - ఢిల్లీలో పోటీ తప్పించి - స్తబ్దంగా వుంది. టీవీ, కేబుల్ పట్ల హడావిడి మొదలైంది. ఇటీవల పత్రికారంగంలో విదేశీ పెట్టుబడులు అనుమతించారు. గత సంవత్సరం టీవీ ప్రకటనల ఆదాయంలో నష్టపోగా, పత్రికారంగం స్థిరంగా వుంది. ఈ మధ్యకాలంలో ఎన్ డి టీవీ, టీవీ టుడే, టీవీ 18, బాలాజీ టెలిఫిల్మ్స్ సంస్థలు పబ్లిక్ యిష్యూలలో పెట్టుబడులు సేకరించాయి. అంతకుమించి 'డెక్కన్ క్రానికల్' పబ్లిక్ యిష్యూ దాదాపు పదిరెట్లు వరకు - అంచనాలకు మించి ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. దీనితో దైనిక్ జాగరణ్, దైనిక్ భాస్కర్ అందరికీ ధైర్యం వచ్చింది. "మేము కూడా రంగంలోదిగి, ముందుకుపోగలమని - డెక్కన్ క్రానికల్ అనుభవం వల్ల బోధపడిం"దని దైనిక్ జాగరణ్ అగర్వాల్ అంటున్నాడు. మరో విషయం ఏమంటే గత రెండు సంవత్సరాలలో అత్యధిక సర్క్యులేషన్ గల పది దినపత్రికలు (అన్ని భాషల్లో) దాదాపు 23 లక్షల సర్క్యులేషన్‌ను (మొత్తంకలిసి) పెంచుకోగలిగాయి. ఇవి చాల్లవా ఆశపడటానికి!

బొంబాయి, చెన్నైల ప్రత్యేకతలు ఏమిటి?

గత పదేళ్ళలో ఢిల్లీలో ఆంగ్ల దినపత్రికల సర్క్యులేషన్ రెట్టింపు అయ్యింది. బొంబాయి కన్నా ఢిల్లీలోనే ఆంగ్ల పత్రికల సర్క్యులేషన్ ఎక్కువ. బొంబాయిలో టైమ్స్ ఆఫ్ ఇండియా దాదాపు ఐదున్నర లక్షల సర్క్యులేషన్‌తో నడుస్తోంది. అంటే ఈ పత్రిక భారతదేశపు మొత్తం సర్క్యులేషన్‌లో మూడోవంతు బొంబాయిలోనే వుంది. బొంబాయి దేశానికి ఆర్థిక రాజధాని. అందువల్లనే ఈ ఆగస్టులో 'హిందూస్థాన్ టైమ్స్' బొంబాయి వస్తోంది. అలాగే 'జీ టీవీ, దైనిక్ భాస్కర్' లు సంయుక్తంగా 'డి.ఎన్.ఏ'' ఆంగ్ల దినపత్రికకు బొంబాయి నుంచి మొదలుపెడుతున్నారు. అలాగే కలకత్తా పత్రిక 'ది టెలిగ్రాఫ్' కూడా బొంబాయి వస్తోందని ప్రచారం వుంది.

చెన్నైయ్ పరిస్థితి ఏమిటి? చెన్నైయ్‌కు దగ్గరలో వుండే నగరాలు బెంగుళూరు, హైదరాబాదుల నుంచి ఐదేసి ఆంగ్ల దినపత్రికలు వస్తుండగా, చెన్నయ్ నుంచి మాత్రం రెండే ఆంగ్ల దినపత్రికలు రావడం విచిత్రమే! ఎంతో కాలంనుంచి ప్రచారం సాగినా, కార్యరూపం యిపుడే వస్తోంది. 'హిందూ' పత్రికను వ్యతిరేకిస్తూ, తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీమతి జయలలిత 'టైమ్స్ ఆఫ్ ఇండియా'ను ఆహ్వానిస్తోందని ప్రచారం వచ్చింది. ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆంగ్ల దినపత్రిక చెన్నయ్ యుద్ధభూమిని సిద్ధం చేసింది. 'హిందూ' కూడా జాగ్రత్తలు తీసుకొంటుందని తెలుస్తోంది. గతంలో బెంగుళూరులో టైమ్స్‌తో పోటీ పడటంలో ఆలస్యంచేసింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో అదే టైమ్స్‌తో పోటీ పడడంలో ఆలస్యం చేయకుండా రేటు తగ్గించింది. ఇపుడు హిందూతో క్రానికల్, టైమ్స్, హిందూస్థాన్ టైమ్స్ పోటీపడి ఎవరు నిలుస్తారో చూడాలి.

పత్రికల జంట వ్యాపారాలు

జీ టీవీ - దైనిక్ భాస్కర్‌తో కలసి పత్రికా రంగంలో దిగుతోంది. గతంలో జీ-సంస్థ ఒక సినిమా పత్రిక ప్రారంభించింది. కానీ యిపుడు కలవడం ఎందుకు? టైమ్స్ ఆఫ్ ఇండియా - ఈ పత్రికతో పాటు ఎకనామిక్స్ టైమ్స్, రేడియో మిర్చి, జూమ్‌టీవీ ఛానల్, వెబ్‌సైట్, ఇంటర్‌నెట్ పత్రిక యిలా అన్ని వారి ప్రకటనలను బాగా ఆకర్షిస్తోంది. దాంతో మిగతా వారికి తమ సామర్థ్యాలు పెంచుకోవాలని ఆశ కలుగుతోంది. జీ సంస్థకు 23 టీ.వీ ఛానళ్ళు, దైనిక భాస్కర్‌కు 26 ఎడిషన్లు వున్నాయి. ఈ రెండూ కలసినపుడు ప్రకటనదారులు విస్మరించలేరు. ప్రచారం తక్కువకాదు. అందువల్ల వీరి "డి.ఎన్.ఏ" పత్రిక బొంబాయిలో టైమ్స్‌కి గట్టి పోటీ యివ్వగలదని ఒక అంచనా!

బొంబాయిలో 'మిడ్-డే' అనే మధ్యాహ్నం పత్రిక కూడా ప్రాచుర్యంలో వుంది. దీని సర్క్యులేషన్ 2 లక్షలు దాకా వుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దాదాపు 25 కోట్లు వెచ్చించి, 'మిడ్-డే'లో పదిశాతం వాటా కొన్నారు. మిడ్-డే యాజమాన్యంలో ఈ సొమ్ముతో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వాటా కొనుక్కుంది. దాంతో ముంబై మార్కెట్‌లో 'ఎక్స్‌ప్రెస్-మిడ్ డే' జంట లాభం పొందవచ్చు.

అలాగే హిందూస్థాన్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్, దైనిక్ జాగరణ్, టైమ్స్ ఆఫ్ ఇండియా విదేశీ పత్రికలతో ఒప్పందాలకు వచ్చాయి. వారు ఈ పత్రికలలో పెట్టుబడులు పెట్టడం, వీరు ఆయా విదేశీ పత్రికలను మనదేశంలో ఎడిషన్లు పెట్టడం జరుగుతుంది. అలా 'వాల్ స్ట్రీట్ జర్నల్', 'బిజినెస్‌వీక్' త్వరలో వస్తాయని అంటున్నారు.

రేపటి ఫలితం?

బొంబాయిలో "టైమ్స్ ఆఫ్ ఇండియా"తో తలపడే "హిందూస్థాన్ టైమ్స్"కు ఢిల్లీలోని ఘాతాలూ, ప్రతిఘాతాలు గుర్తున్నాయి, ఉపయోగపడతాయి. చెన్నయ్‌లో రంగంలోకి దిగుతున్న 'క్రానికల్', 'టైమ్స్' -రెండింటికీ హైదరాబాదు అనుభవం పనిచేస్తుందా? చూడాలి. ఈ యుద్ధం అంతా దేనికి? సర్క్యులేషన్ కోసం! అంతకంటే ప్రకటనలు ఆకర్షించేందుకు అంటే సరిగ్గా సరిపోతుంది! అంటే పత్రికలు ప్రకటనల దారిలో పడటమేకాదు. ప్రకటనకర్తలకు దాసోహమనే పరిస్థితి ఏర్పడుతోంది. దాదాపు 4 నుంచి 7 రూపాయల విలువచేసే దినపత్రిక రూపాయి, రూపాయిన్నరకు లభించడమేమిటి? దీనికి ఈ తులాభారం చూడండి. 2004 జూలై-సెప్టెంబరు మధ్యకాలంలో వార్తాపత్రికల 422 ఎడిషన్లు సర్క్యులేషన్ ద్వారా 4,065 కోట్ల రూపాయలు గడించగా, ప్రకటనల ద్వారా 4,786 కోట్లరూపాయలు పొందాయి.

ఈ పోటీలో చిన్న పత్రికలు క్రమంగా తప్పుకోవడమో, పెద్దవాటిలో కలిసిపోవడమో జరుగుతుంది! ప్రజాభిప్రాయం అనేదానికి ఖాతరు లేదంటే పత్రికల బాణిని ప్రకటనకర్తలే నిర్ణయిస్తారు! మరిన్ని పోటీలు, బహుమతులు అంటూ ఊదరగొడతారు! ఫలితంగా భవిష్యత్తులో "**పత్రికలు చేతికి నిండుగా, బుర్రకు గండిగా**" మారినా ఆశ్చర్యం లేదు!

★

వర్షం కురిసిన రాత్రి

అమృత

రోడ్ల మీది గుంటల్లో నిలిచిన వర్షపు నీళ్లను చిమ్ముకుంటూ ఎర్రమంజిల్ కాలనీ దాటింది ఓ కారు. మురికి నీళ్లు మీదపడకుండా జాగ్రత్తగా నడుస్తున్నారు జనం. కారుశబ్దం వింటేనే భయంతో దూరంగా పరుగులు తీస్తున్నారు. డ్రైవర్... రోజూ హారన్ కొట్టినా తప్పుకోని జనం, ఇప్పుడు కారు శబ్దం వింటేనే ఎలా పరుగులు తీస్తున్నారో చూడు..." నవ్వుతూ, చప్పట్లు చరుస్తోంది రూయా.

సాయంత్రం నాలుగు గంటలకు వాన కురవటం మొదలైంది. అసలిది వర్షాకాలం కాదు. మండుటెండలు కాయాల్సిన ఎండాకాలం. ఏ కాలపు లక్షణం ఆ కాలంలో ఉంటే ఇంకా ప్రత్యేకంగా చెప్పుకునేందుకు ఏముంటుందీ... రుతువులు తమ రీతి తప్పాయో...మనుషులే తమ గతి తప్పి వాతావరణంతో ఆట్లాడుకుంటున్నారో గానీ...వాతావరణంలో ఎవరికీ అంతుపట్టని మార్పులొచ్చాయి.

అందుకే ఎండలే కదా అని ఎవరూ గొడుగులో...నెత్తిమీద టోపీలో తెచ్చుకోలేదు. అకారణంగా అకాలంగా మొదలైన వాన ఆరుగంటలు దాటినా సన్నటి తుంపర పడుతూనే ఉంది. ఆఫీసుల నుండి ఇళ్ళకు చేరుకునేవాళ్ళను దాటుకుంటూ దూసుకుపోతోంది రూయా కారు. ఇంటి ముందు పోర్టికోలో కారు ఆగటంతో చిన్న బొచ్చుకుక్కపిల్ల పరుగులుతీస్తూ వచ్చింది.

"మమ్మీ..." ఏంతో ప్రేమగా పిలిచింది రూయా.

ఇంట్లో అమ్మా, అన్న, అక్కా పనివాళ్ళూ ఉన్నా... ఒక్కళ్ళూ బయటికి రాలేదు. ఎవర్దిపనిలో వాళ్లు బిజీ బిజీ. ఇది తనకు మామూలే.

డబ్బు అవసరమైతే తప్ప రూయా తండ్రిని కలవదు. ఎప్పుడు మనీ కావాల్సివస్తే అప్పుడు 'మై డియర్ పప్పా' అని పలకరించడం, ఆయన 'ఎంత కావాలి బేబీ' అనడగటమూ మామూలు విషయం అయిపోయింది. బంధువులు, ఫ్రెండ్స్ వచ్చినప్పుడే మమ్మీ తనతో కలిసేది. వాళ్ళముందు పిల్లలపై తానెంతో ప్రేమ ఒలకపోస్తున్నట్లు యాక్షన్ చేసి మంచి తల్లిగా మార్కులు కొట్టేస్తుంది.

అలాంటివాళ్ళకు ఇలాంటి వానలొక లెక్కా?! కురిస్తే ఏం కురవకపోతే ఏం...అందుకే వాన దారి వాన కురుస్తూనే ఉంది.

ఇంట్లోకి అడుగు పెడుతున్న రూయాకు ఎదురుగా బొచ్చుకుక్కపిల్ల ముందరి కాళ్లు పైకెత్తి సంతోషంగా కుయ్... కుయ్... మంటూ వెళ్ళింది.

కుక్కపిల్ల మీదపడితే తన డ్రస్ పాడైపోతుందనే భయంతో దాన్ని దగ్గరకు రానివ్వకుండా చెయ్యి అడ్డుపెట్టుకుని గో... గో . . . అంటూ తన రూంలోకి పరుగులాంటి నడకతో వెళ్లిపోయింది.

ఓ స్థాయికి ఎదిగిన తర్వాత ప్రేమలూ, బంధాలు ఉండవేమో. నలుగురూ చూస్తున్నప్పుడు ఇన్‌స్టెంట్ ప్రేమలు ఒలకబోసుకోవటం, ఎవరూ చూడకపోతే ఒకర్ని ఒకరు పట్టించుకోకపోవటం హైయ్-ఫై ఫ్యామిలీస్‌లో మామూలే.

లోపలికి వెళ్ళిన రూయా ముఖం కడుక్కుంది. నిప్పులు చెరిగే ఎండాకాలంలో వేడివేడి టీ, ఒణుకు పుట్టించే చలికాలంలో ఐస్‌క్రీమ్, వర్షాకాలంలో ఫ్రూట్ సలాడ్ తీసుకోవటం ఆమెకు సరదా. అనుకోకుండా కురుస్తున్న వాన ఇప్పుడామెకు చెప్పలేని టైంపాస్ ఎన్‌జాయ్‌మెంట్. లైట్‌గా టిఫిన్ చేసి, ఫ్రూట్ సల్లాడ్ కప్పుతో టెర్రస్ పైకి వెళ్ళింది.

అప్పటికీ సన్నటి తుంపర పడుతూనే ఉంది. ఎత్తయిన ఆ భవనంమీద నుండి చూస్తుంటే అది హైదరాబాద్ సిటీలా లేదు. సుందర స్వప్నంలో అద్భుతమైన నగరంలా కనిపిస్తోంది. దూరం నుండి చూడటంతో బురదమయమైన రోడ్లు, పేరుకుపోయిన చెత్తా... కనిపించట్లేదు రూయాకి. రోడ్లమీద పరుగులు తీస్తున్న కార్ల హెడ్‌లైట్ల కాంతి, తడిసిన రోడ్లపైపడి రిఫ్లెక్ట్ కావటంతో మెరుపు తీగల పరుగుల్లా ఉన్నాయి. ఆ రాత్రి సన్నటి చినుకుల్లో తడుస్తూ కూర్చున రూయా ఏదో లోకంలో విహరిస్తున్నట్లుగా ఫీలవుతోంది.

ఎప్పుడూ ఇలాగే వర్షం కురిస్తే ఎంత బాగుండో... అనుకుంది. ఎంతసేపు అలా కూర్చుందో ఆమెకే తెలీదు. వర్షానికి తడిసిన బట్టలు శరీరానికి అతుక్కుపోయాయి. ఇప్పుడు తననుతాను ఏ 'జుర్మ్' సినిమా హీరోయిన్‌గానో, 'జిస్మ్' సినిమాలో బిపాసాబసు నటి లాగానో ఊహించుకుంటోంది. 'బూమ్' సినిమాలో కత్రినా కైఫ్‌లా సముద్రపొడ్డు ఇసుకలో ఉన్నంత ఫీలింగ్‌లోకి వెళ్ళే ప్రయత్నంలో ఉంది. టెర్రస్ మీదకు తెచ్చుకున్న సీడీ ప్లేయర్‌లోంచి డిజిటల్లీగా వస్తున్న 'టిప్‌టిప్ బరసా పానీ...ఏ పానీ నే ఆగ్ లగాయీ" పాట ఆమె తననితాను మర్చిపోయేలా చేస్తోంది.

*   *   *

ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు స్టూడెంట్స్ ఉంటున్నారు. వాళ్ళతో మరో ఇద్దరు కుర్రాళ్ళుచేరి మందుకొడుతున్నారు. చల్లటి వాతావరణం మధ్య మందు గొంతులోకి దిగుతుంటే ఎంతో హాయిగా ఉంది. టేబుల్ మీదున్న లాప్‌టాప్ స్క్రీన్‌పై రకరకాల బొమ్మలు మారుతున్నాయి. డీవీడీలోనూ బొమ్మలాడుతున్నాయి. కబోర్డ్‌లో హేంగర్లకు తగిలించిన డ్రస్‌లు, రూమ్‌లోని ఫర్నీచర్ వాళ్ళ దర్పాన్ని చాటుతున్నాయి.

చెప్పాపెట్టకుండా వచ్చినా... ఆ వాన ఈ కుర్రకారు బ్రేకుల్లేని ఆనందానికై ఆలోచనలను పరుగెత్తిస్తున్నారు.

టైమ్ రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. అప్పటికే ఒక ఫుల్ బాటిల్ ఖాళీచేసి రెండో బాటిల్ ఓపెన్ చేశారు. ఖాళీ అయిన సోడా, వాటర్ బాటిల్స్, టీపాయిమీద చెల్లాచెదురుగా పడిన జీడిపప్పు, కారా, సిగరెట్ పొగతో నిండిన గది నానా ఖంగాళీగా ఉంది. ఆ పూటకి మందు, చిరుతిండికే దాదాపు రెండువేల రూపాయలు ఖర్చుచేశారు. రెస్టారెంట్‌కు పోయాక భోజనం ఖర్చు మరో రెండువేలు కావచ్చు. ఇంకా ఖర్చు చేయటానికి వాళ్లు పోటీ పడుతున్నారు.

పీకల వరకు మందుకొట్టిన ఒకడు "ఈ రెయిన్‌టైమ్‌లో ఒక్క పోరి ఉంటే ఎంత బాగుంటుంది యార్..." అనటంతో అక్కడివాళ్ల ఆలోచన అమ్మాయి వైపు మళ్ళింది.

ఒకడు కిక్కెక్కువై 'వానా వానా వెల్లువాయె' అని పాటందుకున్నాడు.

"షటప్ యార్... అంత పాతచింతకాయపచ్చడి పాటేందిరా భయ్...జరంత

ఉషారుషారుగుండే పాటయితే మస్తుగుంటది"

వాళ్ళ బుర్రల్లోకి జల్సాచేసేందుకు పోరి కావాలనే ఆలోచనొచ్చింది కదా..ఆ ఆలోచనకు వేడివుట్టే బీట్ ఉన్న పాటందుకున్నాడొకడు.

❊ ❊ ❊

ఈ అపార్ట్‌మెంట్‌కు మరికొంత దూరంలో ఒకచిన్న గదిలో నలుగురు చిరుద్యోగులు అద్దెకుంటున్నారు. వాళ్ళంతా బతుకుదెరువు కోసం పల్లెల్ని వదిలి హైదరాబాద్ వచ్చినవాళ్ళే. రవి పార్టుటైం లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను డబుల్ యంఏ చేయటంతో రూమ్‌లోని వాళ్లంతా ముద్దుగా 'మామా' అని పిలుస్తారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చేసిన భాస్కర్ సాఫ్టువేర్ కంపెనీలో చేస్తున్నాడు. బతికిచెడ్డ కుటుంబం నుండి వచ్చిన కిరీటి బిగ్ బజార్‌లో సూపర్‌వైజర్. మరో అతను స్వరూప్. వీడికి ఒకచోట కాలు నిలవదు. ప్రతి ఆరునెలలకూ ఉద్యోగం మారుతుంటాడు. ఓ పక్క నిరుద్యోగ సమస్యతో జనం కొట్టుమిట్టాడుతుంటే, వీడికి పిలిచిమరీ ఉద్యోగం ఎవడిస్తున్నాడో రూమేట్స్‌కే అంతుచిక్కదు!

వాళ్ళలో చిన్నవాడు వాసూ. వాడు వీళ్ళతో పాటుంటూ సాక్సు, టూత్‌బ్రష్‌లూ చేత్తో

పట్టుకుని కోఠీ, అమీర్‌పేటలాంటి మార్కెట్టులో తిరుగుతూ అమ్ముతాడు. అనుకోకుండా వచ్చినా...అనుకుని వచ్చినా ఈ వాన వాసులాంటి వాళ్లకు పిడుగుపాటే. జరుగుబాటుకి గ్రహపాటే.

బడ్జెట్ బతుకులు వాళ్ళవి. నెలకొకళ్లు చొప్పున రూమ్ మెయిన్‌టెన్ చేయాలి. ఈ నెల రవి వంతైంది. ఐదుగురు ఫ్రెండ్స్ రెండు రోజులు వాళ్లతో ఉండిపోవటంతో బడ్జెట్ తల్లకిందులైంది. చాపమీద పడుకున్న రవి కాళ్లు గోడకు తన్నిపెట్టి ఆలోచిస్తున్నాడు. మిగిలిన ముగ్గురూ అదే చాపమీద ఒకళ్ల కాళ్లు మరొకరికి దిండులా చేసుకుని పడుకున్నారు.

అక్కడ మౌనం రాజ్యమేలుతోంది. ఇంకా పదిరోజులు గడవాలి. చేతిలో ఉంది రెండొందలు. అప్పు చేయటం ఇష్టంలేదు అని చెపుతున్నా, అసలు అప్పిచ్చేవాడేలేడు. అయినా ఈ వానలో ఆ అప్పు ఇచ్చేవాడు ఎక్కడ దొరుకుతాడు. పస్తు పడుకుంటే మరుసటి రోజు నీరసం. దాని ప్రభావం కచ్చితంగా కనిపిస్తుంది. ఎలా?... ఎలా సర్దుబాటు చేయాలి ఈ పదిరోజులు? ఇదే ఆలోచన.

సడన్‌గా రవిలేచి, "ఈ రోజు అన్నం వండాల్సిన పనిలేదు"... అన్నాడు.

"ఎం బాబు... రాత్రిపూట పస్తుపడుకుంటే ఆరోగ్యానికి మంచిదని మళ్ళీ ఎవరైనా చెప్పారా? నావల్లకాదు" రెండు చేతులు జోడించి దండం పెడుతూ చెప్పాడు భాస్కర్.

మిగతా ఇద్దరుకూడా పస్తు ఉండటం మావల్లకాదంటే మావల్లకాదంటూ నిష్కర్షగా చెప్పేశారు.

"తొందర పడతారెందుకు నాతో రండి, ఈ రోజుకు కడుపు నిండే ఉపాయం చెపుతా..." అంటూ షర్టు వేసుకుంటున్నాడు రవి.

"ఈ బురదలో నేను రాను. జీన్సు ప్యాంట్ నిన్ననే వేసుకున్నా ఇంకా ఐదు రోజులు వేయాలి. హైదరాబాద్ బురద సంగతి నాకు బాగా తెలుసు. అంతా ఆయిలీగా ఉంటుంది. బురద నీళ్ళు పడితే మరకలుపోవు. నాకున్నాయే రెండు ప్యాంట్లు. ఒరేయ్ మామా... మీరే అంత పార్శిల్ కట్టించుకొస్తే ఇక్కడే తింటా..." అంటూ బతిమాలుతున్న ధోరణిలో చెప్పాడు స్వరూప్.

"పోనీ నా షాట్ వేసుకుని రారా..." అంటూ భాస్కర్ గోడకు తగిలించిన షాట్‌ను తీయబోతుంటే,

"ఒద్దుస్వామీ ఒద్దు... నన్నిలా బతకనివ్వు. రేపు గజ్జి పుడితే డాక్టర్ ఫీజు ఇచ్చుకోటానికికూడా నాదగ్గర డబ్బులేదు. దాన్ని ఉతికి నెలరోజులవుతుందన్న సంగతి నాదగ్గర దాయెద్దు. హైదరాబాద్‌లో నీళ్లులేకపోతే మాత్రం సన్‌వాష్ అంటూ ఎండకు ఆరేసి దులిపి వేసుకోవాలా?...పోనీ ఇప్పుడు అప్పనంగా వస్తున్న వానలోనన్నా తడిపి ఆరేయ్యొచ్చు కదా" సణుగుతూ మూడంకె వేసి చాపమీదే ముడుచుకుపోయాడు స్వరూప్.

"అరేయ్ కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి. నీకు డ్రస్ లేకపోతే గోచీ పెట్టుకుని రా... ఇక్కడ పడుకుంటే మాత్రం తెచ్చిపెట్టేదిలేదు..." అరిచినంత పనిచేశాడు కిరీటి.

ఇంతలో భాస్కర్ వచ్చి స్వరూప్‌ను చావమీదినుండి కిందికిలాగి దాన్ని చుట్టేయటంతో, గత్యంతరం లేక విసుక్కుంటూ ప్యాంట్ వేసుకుని బయలుదేరాడు.

వాళ్ళు రోడ్డుమీద కాలు పెట్టేప్పటికి దాదాపు రాత్రి పది గంటలవుతోంది. వర్షం తగ్గినా చెట్ల ఆకుల మీద నుండి ఒకొక్క బొట్టూ జారిపడుతూనే ఉన్నాయి.

తోపుడుబండ్లవాళ్ళు వానకు బేరాలులేక ఉసూరుమంటూ గ్యాస్ లైట్లు ఆర్పి ఇళ్లకు చేరుతున్నారు. ఆ సీన్ చూసిన రవి ముఖం వికసించింది. అతని కళ్ళలో ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది. సంతోషంతో వెలిగిపోతున్న మిత్రుని ముఖం చూసిన వాళ్లకు రవి ఆలోచన అర్థమైంది.

వెంటనే భాస్కర్ ఓ అరటిపండ్ల బండిని ఆపి బేరం చేయటం మొదలుపెట్టాడు. మిగతా ముగ్గురూ స్వరూప్‌కు సపోర్టుగా బేరమాడారు. చివరకు డజను ఎనిమిది రూపాయలకు బేరం ఖరారుచేసి తీసుకున్నారు. తలా రెండు అరటిపండ్లు అక్కడే తిని దగ్గర్లోని ఇరానీ హోటల్‌కు వెళ్లి త్రీ బై ఫైవ్ చాయ్ తాగి తృప్తిగా రూమ్ వైపు నడుస్తున్నారు.

"ఒరే మావా ఈ రోజు గడిచిపోయింది. ఇంకా తొమ్మిది రోజులు... నూట ఎనభై ఆరు రూపాయలు... రేపూ ఇలాగే వాన కొట్టిందంటే... అర్థాకలితో గడపాల్సిందేరా?..." కిరీటి అంటుండగా, మళ్ళీ చినుకులు పడటం మొదలైంది. బట్టలు తడిస్తే రేపటికి మరో జతలేని స్వరూప్ పరుగు లంకించుకున్నాడు. "ఈ వర్షం పాడుగాను..." అనుకుంటూ మిగతావాళ్లూ అతని వెనక పరుగుతీస్తున్నారు.

ఇక రేపూ సాక్సు, టూత్‌బ్రష్‌లు అమ్మడానికి వెళ్ళలేకపోతే ఏం చేయాలిరా బాబో...అనుకున్నాడు వాసు. అలా వానలో తడుస్తూనే రూమ్‌కి వెళ్తున్నారు. ఎప్పుడూ ఇంటెరెస్టుగా వినని వాసు పాటెందుకో ఇప్పుడు వాళ్ళందరికీ నచ్చింది.

"చినుకు చినుకుల వాన ఉయ్యాలో...చిత్తారి వాన ఉయ్యాలో

ఉన్నోళ్ళ లోగిట్లో ఉయ్యాలో..పన్నీటి వాన ఉయ్యాలో

లేనోళ్ళ గుడిశెల్లో ఉయ్యాలో... కన్నీటివాన ఉయ్యాలో"

★

వేగం పెరుగుతోంది!

ముదిగంటి సుజాతారెడ్డి

టీవిలో చూపిస్తున్నారు - మార్కెట్లోకి ఎన్ని రకాల కొత్త మొబైల్స్ వచ్చాయెూ! రాబోతున్నాయో! మొబైల్లో మాట్లాడే ఎదుటివాళ్ళ బొమ్మ కన్పిస్తుంది. అదీ రంగుల్లో. అంతేకాదు మొబైల్‌ఫోనులోనే కెమెరా ఫోటోలు తీయవచ్చుట! అంతేకాదు మొబైల్ ఫోనులోనే టీవీ! మొబైల్ ఫోనులోనే ల్యాప్‌ట్యాప్! ఇంకేం కావాలి ఇన్ని రకాల మొబైల్స్ మార్కెట్లోకి ఉప్పెనలాగా వస్తే?! అవి కావాలని కోరుకోకుండా ఎట్లావుంటాం మనం! ఆ మధ్య పత్రికలో రెండు రోజులు ఓ వార్త చదివాను. తలిదండ్రులు మొబైల్ ఫోను కొనియ్యలేదని కౌమారవస్థలోవున్న కొడుకులు ఆత్మహత్య చేసుకున్నారని! నిజమే స్నేహితులందరికీ మొబైల్ ఉండగా తనకి కొనియ్యకపోతే చావటం తప్ప వేరే మార్గమేముంటుంది! ఇదీ ఆధునిక ఆవిష్కారాలమీది మోజు! మార్కెట్ సంస్కృతి ప్రలోభం! ఈ ప్రలోభాల నుంచి ఎవరు మాత్రం బయటపడగల్గుతారు. అని ఆలోచిస్తున్నాను. లలిత లోపలికి వచ్చింది. దాని వైపు చూసాను. దానిలో ఏదో మార్పు కన్పించింది. పరిశీలనగా చూశాను.

ఆహా! దాని వేషంలో ఎంత మార్పు? పొడుగైన కొంగు చేతి మీదుగా ఎడమవక్కగా వేలాడుతున్నది. చేతిలో మొబైల్! దాని గుప్పిట్లో ముద్దుగా ఇరికిపోయింది.

"ఏమిటే లల్లీ వేషం మారింది?" అన్నాన్నేను చిరునవ్వుతో.

"ఏం మారింది!" అంది ఆశ్చర్యపోతూ.

"ఏంలేదు! గుప్పిట్లో ప్రపంచాన్ని పట్టుకున్నావు!'' నవ్వాన్నేను.

''ఓ! మొబైలా!... కొన్నాను. బాగాలేదా?" అడిగింది లలిత ఉత్సాహంగా...

''మొబైల్ చాలా బాగుంది. నీ చిన్న గుప్పిట్లో ఇమిడి పోయింది. అయినా నీకు మొబైల్ ఎందుకే?" అడిగాన్నేను.

"మొబైల్ ఎందుకేమిటే! నీదో విచిత్రం. నీదంతా పాతకాలపు ధోరణులు, మోడర్న్‌గా వుండటం నేర్చుకో! అంది లలిత విసురుగా.

ఏమిటి లలితలో ఇంత మార్పు! ఇంత వేగం! ఇంత విసురు!... విస్తుపోయాన్నేను.

"ఈ మొబైల్ చేతిలో వుంటే క్షణంలో ఎవరితో అంటే వాళ్ళతో మాట్లాడవచ్చు" అంది లలిత.

"మాట్లాడి?..." అన్నాన్నేను ప్రశ్నార్థకంగా.

"మాట్లాడి వాళ్ళ క్షేమసమాచారాలు తెలుసుకోవచ్చును. ఏం చేస్తున్నారో కనుక్కోవచ్చును." అంది లలిత చిరునవ్వుతో.

"ఏం కూర వండారు. ఏ పులుసు చేశారు. తెలుసుకోవచ్చును అంతేనా!" అన్నాన్నేను. కొద్దిగా వ్యంగ్యాన్ని అంటిస్తూ.

"అబ్బా! నువ్వేంటే సుశ్శీ! అందరూ మొబైల్స్ కొనుక్కొని ఇట్లా పట్టుకొని తిరుగుతున్నారు. నా దగ్గర లేకపోతె నాకెట్లా వుంటుంది చెప్పు? ఆధునికంగా లేకపోతే పాత చింతకాయ పచ్చడి అంటారు. మొబైల్ కూడా లేని నా వైపు ఈసడింపుగా చూస్తారు. ఆ లుక్కులు భరించలేకున్నానే. ఈ మొబైల్ ఎంతో ధర లేదు. ఇది కొన్నింక టెలిఫోన్ బిల్లు కూడా తగ్గింది..." అంది లలిత.

ఇంకా చెప్పుకపోయే మూడ్‌లో వుంది. కాని దాని వాక్ప్రవాహానికి నేనే మధ్యలో అడ్డుకట్ట వేసాను.

"మరి మొబైల్ కయ్యే ఖర్చు!"

"ఇక మొబైల్ కొన్నంక ఆ ముచ్చట వుండవల్సిందే కదనే. ఆ ఖర్చు భరించాలె. అందరితో సమానం అనిపించుకోవాలంటె ఆ మాత్రం ఖర్చు పెట్టాలె" తిరుగుఅంది లలిత.

ఇంతలో దాని పిడికిట్లో ట్రిన్ ట్రిన్ అని మోగింది. దీనికి మొబైల్ ఆన్ చేయటానికి ఏ బటన్ వొత్తాలో చూసి వత్తటానికి కాసేపు సమయం పట్టింది. ఆ చిన్ని యంత్రాన్ని చెవికి దగ్గరగా చేర్చుకుని "హలో!..." అంది లలిత. ఎదుటివాళ్ళేం అంటున్నారో నాకు వినిపించలేదు. గాని

"ఆ!... ఇప్పుడే బయలుదేరుతున్నాను" అంది లలిత. చెవి దగ్గర్నుంచి మొబైల్ దింపి "నేను పోవాల్నె" అంది లలిత.

"ఎక్కడికే ఈ పరుగు. మా ఇంటికి వస్తేఎంతసేపైనా కుర్చునే దానివి ఏమైంది? ఈ పరుగెందుకు?" అడిగాన్నేను.

"కొత్తగా ఓ స్నేహితురాలు దొరికింది. మూవీకి పోదాంరా అంది. టిక్కెట్లు కూడా తీసుకుందట. థియేటర్ దగ్గర నా కోసం ఎదురుచూస్తున్నది. పోవాలనే" అని లేచి నిలబడింది లలిత.

"అబ్బ! ఏమిటే ఈ తొందరలు! థియేటర్ దగ్గర సినిమా టిక్కెట్లు కొని నిన్ను పిలవటమేందే! నువ్వు ఈ పరుగులు ఏమిటే! ఇంట్లో చెప్పవా? సినిమాకు పోతున్నానని" అడిగాన్నేను ఆతురతగా.

"నీ కెందుకే గాబరా! నేను థియేటర్నుంచే మా ఆయనతో మొబైల్లో మాట్లాడ్తాను. సినిమాకు పోయానని చెప్తాను." అంటూ బయటికి నడిచింది. వేగంగా లలిత.

ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టిందోలేదో "ఆటో.." అని అరిచింది లలిత. ఎప్పుడూ నెమ్మదిగా కూలబడిన చోటనే కూలబడి ముచ్చట్లు పెట్టే లలిత ఏమిటి ఈ ఉరుకులు పరుగులు! అని ఆలోచిస్తూ ఉండిపోయాన్నేను.

ఆధునికత వేగాన్ని తెస్తూవుంది మరి! తప్పించుకోవటం ఎవరి తరం! ★

చిలుకలు వాలిన చెట్టు

శాఖమూరి శ్రీనివాస్

మోహన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. అతనికి ఇటీవల చందరవం గ్రామం బదిలీ అయింది. మొదటి రోజు ఎంతో ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లాడు. పరిసరాలను గమనించాడు. అక్కడి అపరిశుభ్రతను చూడగానే చాలా బాధేసింది ఆయనకు. సాయంకాలం విద్యార్థులందరినీ ఆటస్థలంలో సమావేశపరిచాడు.

అంతా అల్లరిగా... చింపిరి జుట్టుతో... ఒళ్లంతా మురికిగా... గొడవచేస్తూ తమ పనులు తాము చేసుకుంటున్నారు. వారిని చక్కగా వరుసలో నిలబెట్టడానికి, తను చెప్పేది వారు వినేలా చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. వారు ఆయన మాటలు వినేందుకు సిద్ధమయ్యాక "ప్రియమైన విద్యార్థులారా..! మీరు అల్లరి చేయకపోతే మీకో మంచి మాట చెబుతాను. మీరెప్పుడైనా చిలుకలను చూశారా?" అని ప్రశ్నించాడు.

చాలా తక్కువ మంది చూశామని తల ఊపారు. "మీలో చాలా మంది చిలుకలనే చూడలేదు. మరి ప్రతి రోజూ వాటిని చూస్తూ వాటితో ఆడుకోవడం ఇష్టమేగా?" అని అడిగాడు.

"ఓ... చాలా ఇష్టం" అన్నారు పిల్లలంతా.

"అయితే మీరు వాటితో రోజూ ఆడుకునేలా చేస్తాను. నేను చెప్పినట్లుగా మీరు ప్రతి రోజూ చేయాలి. కొద్ది రోజుల్లోనే చిలుకలు వస్తాయి" అన్నాడు మోహన్.

"అలాగే సార్. ఏం చేయాలో చెప్పండి" అన్నారు పిల్లలు ముక్త కంఠంతో.

"ఏ రోజు చేయవలసింది ఆ రోజు చెబుతాను. బడికి డుమ్మాకొట్టే వారికి ఆ చిలుకలు కనపడవు. ఇక ఈ రోజుకు ఇంటికి వెళ్లండి. రేపు ఉదయాన్నే బడి సమయం కంటే ఓ గంట ముందు రండి" చెప్పారు మాష్టారు.

మరునటి రోజు ఓ గంట ముందుగానే చాలా మంది విద్యార్థులు వచ్చారు. కొంత మంది బడి ఆవరణలోని చెత్త తీసి పారవేసేటట్లు, కొందరు మోహన్ తెచ్చిన మొక్కలు నాటేటట్లు, కొందరేమో బడి ఆవరణను నీటితో శుభ్రం చేసేటట్లు పనులు పురమాయించాడు మోహన్.

ఆ రోజు నుండి బడి పరిసరాలు శుభ్రంగా వుంచుకోవడంలో, మొక్కలు పెంచడంలో పోటీలు పడ్డారు విద్యార్థులంతా! వారు వ్యక్తిగతంగా కూడా పరిశుభ్రంగా వుండటం నేర్చించారు మాష్టారు.

అలా ఒక సంవత్సరం గడిచింది. బడి ఆవరణ అంతా అందంగా తయారైంది. మొక్కలు బాగా ఎదుగుతున్నాయి. ఒక జామ చెట్టుకైతే కాయలు కూడా కాశాయి. ఓ రోజు ఒక విద్యార్థి మోహన్ దగ్గరకు వచ్చి "మాష్టారూ... జామచెట్టుపైన చిలుక వాలింది. చూద్దాం రండి..." అన్నాడు రొప్పుతూ.

అందరూ కలిసి జామచెట్టును సమీపించారు. జామ పండు తింటోన్న రామచిలుక కనిపించిందక్కడ! పిల్లల సంతోషానికి అవధుల్లేవు. మరునటి రోజు మరికొన్ని చిలుకలు వచ్చాయి. ఇక రోజూ చిలుకలు, పిల్లలు మాట్లాడుకోవడం- ఆటలాడుకోవడం మామూలైంది. పిల్లలకు బడి ఎంతో ఇష్టంగా మారింది.





రెండు సున్నాలు గియ్యాలి.

ఇప్పుడు వాటికి మూడు చిన్న సున్నాలు తగిలించాలి.

ఇంక చెవులు, కళ్లు వెయ్యాలి.

చివరిగా నోరు గీసి రంగులు అద్దితే సరి. గడుసు పప్పీ మీ ముందుంటుంది.

చిన్నారి చిత్రకారులు



కె.భానుచందర్, 5వ తరగతి, శ్రీ శారదా విద్యాలయ, శ్రీనగర్ కాలనీ, కొత్తగూడెం, ఖమ్మం.



జి.రజనీ కుమారి, 10వ తరగతి, అమరావతి టాలెంట్ స్కూల్.



వి.శ్రీనివాసరావు, 9వ తరగతి, లయోలా హైస్కూల్, వినుకొండ, గుంటూరు.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

నేస్తాలూ! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో తెలుసా! అవునా. ఈయన సిపిఎం నూతన సారథిగా కూడా ఇటీవలే ఎన్నికయ్యారర్రా! మరయితే ఆయన పేరు కార్డుమీద రాసి పోస్ట్ చేయండి. మా చిరునామా తెలుసుగా. **వీరివీరి గుమ్మడి పండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

<u>సరైన సమాధానాలు రాసినవారు</u>

బి.విజయలక్ష్మి .పి.రామారావు, ఎమ్.విజయచందర్, 8వతరగతి, కృష్ణలంక, విజయవాడ. కొండముది శ్రీనివాస్, వి. పాండురంగారావు, 10వ తరగతి, ఎల్. కాంతారావు, పి. పుష్పవతి, 6వతరగతి, సంగుపాలెం కోడూరు, గుంటూరు. కె. కనకమహాలక్ష్మి 3వ తరగతి, బి. విజయకుమార్, 9వ తరగతి, ఎమ్ విశాలాక్ష్మి 10వ తరగతి, ఎల్. కుముదిని 3వతరగతి, రామ్‌నగర్, హైదరాబాద్. వి. విశాల్, 7వతరగతి, కంచారం. పి.పరమేశం, కె. సుందర్, 7వతరగతి, పశ్చిమగోదావరి. పి.సృజన, 3వతరగతి, వి. వినోద్‌కుమార్, 8వ తరగతి, అద్దంకి, ప్రకాశం. కె.కరుణాకర్, 10వ తరగతి, లక్ష్మినగర్, మెదక్.

గతవారపు జవాబు
మహేంద్ర దోనీ

చుక్కలు కలిపితే....

బంతి తెచ్చుకోవడం ఎలాగబ్బా!



హేయ్! ఈ బుడ్డోడికి పరీక్షలు అయిపోయాయి. మీక్కూడా అంతేకదూ. పాపం వాడు ఎంతో సంతోషంగా ఆడుకుంటుంటే... ఏం జరిగిందనుకుంటున్నారు! వాడి బంతి వెళ్లి చెట్టు పైన పడింది. అక్కడేమో కొమ్మలు గుబురుగా వుండడంతో బంతి అక్కడే చిక్కుకు పోయింది. వీడికేమో ఆ బంతంటే ప్రాణం. దాన్ని తెచ్చుకోవడానికి మూడు దారులు కూడా వున్నాయి. మరి ఏదారిలో వెళితే బంతి దొరుకుతుందో కనిపెట్టండి. ❄

తేడాలు కనుక్కోండి



పక్షిని చేద్దాం

నేస్తాలూ... ఇవాళ మీకు పక్షిని చెయ్యడమెలాగో చెప్దామనుకుంటున్నాం. అదీ కాగితంతో. సంతోషమేనా! అయితే వెంటనే చెప్పేసుకుందామా! ఇంతకీ పక్షిని చెయ్యడానికి **ఏమేం కావాలంటే...** మీ నోడ్సు పుస్తకాల అట్టముక్క, మందపాటి చార్టు, పల్చటి తెల్ల కాగితం, పెన్సిల్, క్రేయాన్లు, దారం, కటర్, గమ్, సన్నటి కర్రపుల్ల. **ఎలా చేయాలంటే...** ముందుగా ఒక పక్షి బాడీని పల్చటి కాగితం మీద ట్రేస్ చేసుకోవాలి. అంటే ఏదైనా పుస్తకంలో చక్కటి పక్షి బొమ్మ వుందనుకోండి. దానిమీద పల్చటి కాగితం పెట్టి పక్షి ఆకారాన్ని గీసుకోవడమన్నమాట.

తర్వాత ఆ కాగితాన్ని అట్టముక్కమీద వుంచి అదే షేపులో



అట్టను కత్తిరించుకోవాలి. అంటే పక్షి బాడీ మీ చేతుల్లో వుందన్నమాట. దీనికి రెండు వైపులా రంగులు అద్దాలి. 2వ బొమ్మలో చూపించినట్టుగా రెండు చోట్ల పెన్సిల్‌తో గీతలు గీసుకుని కత్తిరించాలి. తర్వాత పల్చటి కాగితాలు రెండు తీసుకోవాలి. వాటిని 3వ బొమ్మలో చూపించినట్టుగా మడవాలి. ఇప్పుడు ఆ కాగితాలను పక్షి బాడీలోని రంధ్రాల నుంచి దూర్చాలి. అంటే పక్షికి రెక్కలు, తోక పెట్టామన్నమాట. తోకకు రెండు చీలికలుగా వున్న కాగితాలను కలిపి (4వ బొమ్మలో చూపించినట్టుగా) అతికించాలి.

చివరిగా పక్షికి ముక్కు, కళ్లు గియ్యాలి. వాటికీ రంగులు వెయ్యాలి. తర్వాత పక్షి పైభాగాన సరిగ్గా మధ్యలో ఒక చిన్న రంధ్రం చేసి దారం కట్టాలి. దీన్ని సన్నటి కర్రపుల్లకు ఒక చివరన తగిలించాలి. ఇలాంటి మరో పక్షిని తయారుచేసి కర్రపుల్లకు మరోవైపున తగిలించాలి. దీన్ని మీ తరగతి గదిలోనో , ఇంట్లోనో వేలాడదీస్తే సూపర్‌గుంటుందిలే. మరి చేసేస్తారుగా. ఈ వారానికి బైబై.

వచ్చేవారం మరో మాంచి బొమ్మను తయారుచేయడం ఎలాగో చెప్పేసుకుందాం. ఈ మాటను మీ నేస్తాలకు కూడా చెప్పండే.



చలికాలం కావడాన సమయం ఎనిమిదయినా మంచు కురుస్తూనే ఉంది. నల్లని కొండ సిలువలా ఉన్న తారురోడ్డుపై ప్రయాణించే వాహనాలు మంచులో కనపడేలా లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నాయి.

రోడ్డుకు ఒక వైపున ఖాళీ యూరియా సంచులను చుట్టి ఉన్న గుడిశెలో బల్లపై ప్లాస్కు, దాని పక్కనే ఓ పది గాజుగ్లాసులు ఉన్నాయి. ఇంకాస్త లోపల రెండు కాలుతున్న కట్టెల పొయ్యిలు ఉన్నాయి.

"బిక్షమయ్యా...! ఒక చాయ్ ఇవ్వు" అంటూ పక్కన కట్టిన నాపరాళ్ళ దిమ్మెపై కూర్చున్నాడు నలభై-నలభైఐదు సంవత్సరాల మధ్య వయసున్న పెద్దాయన

"మీ అబ్బాయికి ఇంజనీరింగ్ సీటొచ్చిందంటగా...సంతోషం" అన్నాడు ఆ పెద్దాయన.


ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిగా

పేపర్‌బాయ్‌గా

ఇంజనీర్ అయిన పేపర్‌బోయ్

పుష్పాల & నూకపంగు

ఆ మాటలు పూర్తి కాకముందే బిక్షమయ్య మొహంలో ఏవేవో మాటలకందని వెలుగులు. కళ్ళల్లో ఆ మాటల తాలూకు ఆనందం స్పష్టంగా కనబడుతోంది.

కాసేపాగి ఆ సంతోషం నుండి తేరుకొని 'అవునండీ వాడు పడ్డ కష్టం ఫలితంగానే ఇంజనీరింగ్ సీటొచ్చింది. అన్నాడు.

పక్కనే వున్న ఆయన భార్య నిర్మలమ్మ 'మా గొప్పేముందండీ అంతా మావాడి పట్టుదల' అంది.

పొద్దున్నే దినపత్రికలు ఇంటింటా పంచి తన హోటల్‌కు చేరుకున్నాడు విజయ్. వస్తూనే హోటల్‌లో తాగివున్న గ్లాసులను కడిగి బల్లపై బోర్లించి లోపలికెళ్ళాడు.

'ఈ అబ్బాయెవరు?'' ప్రశ్నించాడు అంతకు ముందు ఎంసెట్ సీట్ గురించి అడిగిన పెద్దాయన.

'మా అబ్బాయేనండీ, ఇంజనీరింగ్ సీటొచ్చింది వీడికే' చెప్పాడు బిక్షమయ్య.

ఈసారి ఆశ్చర్యపోవడం ఆ పెద్దాయనవంతయ్యింది. 'కళ్ళల్లో కొట్టొచ్చినట్టు కనపడే జ్ఞాన తేజస్సు, అవసరమైతే టీ కప్పులు కడిగే నిర్మలత్వం. కాబోయే ఇంజనీర్ అనే భావం మోములోనే కాదు మనిషిలో సైతం అణువంత కూడా కనపడని ఈ అబ్బాయికా ఇంజనీరింగ్ సీటొచ్చింది' అనుకున్నాడు.

నిజమే. ఎవరైతే కలలు కంటారో అక్కడ లక్ష్యం తప్పక నెరవేరుతుందనడానికి విజయ్ చక్కని ఉదాహరణ. పట్టుదల వున్న వ్యక్తి, పేదరికపు అడ్డుగోడలను తన్ని అవతలికి దూకి అనుకున్నది సాధిస్తాడు.

విజయ్ ఇంజనీరింగ్ సాధించడానికి వెనుక ఎంతో కఠోర శ్రమ వుంది.

చిందే ప్రతి చెమట బొట్టులో తన కలల సూర్యుడు తాకినపుడు మెరిసే వెలుగులా తన కనుల ముందు కనిపించేది. పెయింటింగ్ వేసినా, తాపీ వేసినా, లక్ష్యాన్ని మాత్రం మరువలేదు.

తాపీ పనిలో తట్టలు మోసిన ఆ మెదడునే ఇంజనీర్ అయి ఇండ్లు నిర్మించే స్థాయికి పెంచుకున్నాడు. ఫలితంగా తన కల సాకారమయ్యింది.

* * *

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలానికి చెందిన చిప్పలపల్లి బిక్షమయ్య, నిర్మలమ్మకు నలుగురు సంతానం. తనకున్న పావు ఎకరం పొలాన్ని సేద్యం చేసుకుంటూ టీ స్టాల్ నడుపుకుంటూ కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నాడు. మొదటివాణ్ణి 10వ తరగతి వరకు చదివించగా, అతను డ్రైవింగ్ నేర్చుకొని తండ్రికి సహాయంగా వుంటాడనుకున్న సమయాన పెళ్ళి చేసుకొని వేరు కాపురం పెట్టాడు.

రెండోవాడే విజయ్‌కుమార్. కామేపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివి అందులో 454

మార్కులు సాధించాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ (ఎంపిసి) చదివి అందులో 611 మార్కులు సాధించాడు. సరిగ్గా ఆ సమయానే కళాశాల గణిత ఉపాధ్యాయుడు అజయ్ దృష్టిలో పడ్డాడు విజయ్. ఒకరోజు...

విజయ్! ఇంటర్ తరువాత ఏం చేయాలనుకుంటున్నావ్?' అడిగాడు మేథ్స్ టీచర్.

ఇంకా జీవితం సరిగా తెలియని వయస్సు, చదవాలనే పట్టుదల వున్నా ఆర్థిక ఇబ్బందులు. ఇవేమి పట్టించుకోకుండానే తన లక్ష్యాన్ని నిర్భయంగా సార్‌కి తెలియజేశాడు.

'సార్...! నేను ఇంజనీర్ అవుదామనుకుంటున్నాను' అన్నాడు.

అది మొదలుకొని ఎప్పటికప్పుడు విజయ్‌కి సబ్జెక్టులో వున్న డౌట్స్‌ను క్లియర్ చేస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి కావలసిన ఆత్మవిశ్వాసాన్ని విజయ్‌లో నింపుతూ, ఎంసెట్ 2004కి సన్నద్ధం చేసాడు మాస్టారు.

మనసులో సాధించాలన్న పట్టుదల వుండాలేగాని దానికి ఎవరో ఒకరు తప్పకుండా చేయూత అందిస్తూనే వుంటారు. వట్టికోట మోహన్‌రావు అనే ప్రముఖ వ్యాపారవేత్త రోజులాగే ప్రజాశక్తి దినపత్రిక చూస్తుండగా 'పేదరికాన్ని జయించే తపన' శీర్షికన విజయ్ చదువు ఆటుపోటుల మధ్య సాగుతుందన్న విషయం చదివి చలించి ఆ అబ్బాయి చదువుకు అయ్యే ఖర్చుకు మొత్తం కాకపోయినా తన వంతు సాయంగా ఐదువేల రూపాయలు విరాళంగా ఇచ్చాడు.

అదే వార్త పేపర్లలో చదివిన భాస్కర్ ఒకరోజు అపరిచిత వ్యక్తిగా ఆ ఊరు వెళ్ళాడు.

"బాబూ... రోజు నీ దిన చర్య ఎలా సాగుతుంది అని ప్రశ్నించాడు."

'ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు లేచి క్లాస్ బుక్స్ చదువుతాను. ఆరుగంటలకు బస్టాండ్‌కు పోయి బస్సుల్లో వచ్చే పేపర్ కట్టలను తీసుకొని వాటిని ఇంటింటికీ పంచుతాను. ఉదయం పేపర్లు పంచినా నాకు పేపర్ చదివే సమయం కూడా దొరకదు. రాత్రికి ఏజెంట్ దగ్గర మిగిలిన డిసి పేపర్ చదువుతాను. పేపర్ పార్సిళ్ళు మిస్సయిన రోజున అందరూ అడుగుతారు, వారికి సమాధానం చెప్పడం కష్టమే అయినా తప్పని పరిస్థితి. పేపర్లు పంచగా వచ్చే డబ్బుతో కావలసిన పుస్తకాలు, నోట్సులు కొనుక్కుంటాను. ఖాళీ సమయంలో టీ కొట్టు వద్ద అమ్మా నాన్నలకు సహాయపడతాను. వేసవి కాలంలో సుతారి పనికి పోతాను' అని ఆ పదహారేళ్ళ బాబు మాటలు వినే వరకే చలించిపోయాడు భాస్కర్.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.ఎస్. ప్రసాద్ చేతుల మీదుగా విజయ్‌కుమార్‌కు నగదును అందజేస్తున్న దృశ్యం.

'మరి ఇంత చదువుకొన్న నీవు టీ గ్లాసులు కడగడం షేమ్ అనిపించడం లేదా?' ప్రశ్నించాడ అతని మనసులో మాటను తెలుసుకుందామని.

'సిగ్గెందుకు... మా హోటల్‌కి నాతో చదువుకొనే నా స్నేహితులు కూడా వచ్చి టీ తాగుతుంటారు. వారు తాగిన గ్లాసులను కూడా నేనే కడుగుతాను. ఆ సందర్భంగా నేను సిగ్గుపడను. ఒకసారి పదవ తరగతిలో, ఇంటర్‌లో పరీక్ష ఫీజు కట్టడానికి నాన్న చాలామందిని డబ్బులు అడిగాడు. నేను ఆ సందర్భంలో చాలా బాధపడ్డాను. అప్పటి నుండి ఎలాగైనా డబ్బు సంపాదించాలనే పట్టుదల పెరిగింది. వీలున్నపుడల్లా కూలీ పనులకు పోతుంటాను. ఏడవ తరగతి చదువుతున్న తమ్ముడూ, ఇంటర్ చదువుతున్న ఇంకో తమ్ముడూ నేను పడ్డ బాధలు పడకూడదని, వారిని కూడా మంచి ప్రయోజకుల్ని చేయాలనేది కూడా నా ప్రయత్నం' అంటూ తన ఆలోచనలను చెప్పాడు.

విజయ్ ఎదురుచూస్తున్న ఎంసెట్ ఫలితాలు వచ్చాయి. పడ్డ శ్రమ ఊరికే పోలేదు. ఎస్సీ కేటగిరీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ వరంగల్‌లో ఫ్రీ సీట్ వచ్చింది. ఖమ్మంలోని వజీర్ సుల్తాన్ ఇంజనీర్ కళాశాలలో జాయిన్ అవ్వాల్సిందిగా లెటర్ పంపారు. కానీ వేరే చోటికి వెళ్లి చదివే స్తోమత లేక తన గ్రామ సమీపాన ఉన్న కారేపల్లిలో శ్రీ కవితా ఇంజనీరింగ్ కళాశాలలో చేరాడు.

విజయ్ తండ్రి బిక్షమయ్య ఎన్నో కష్టాలుపడి పిల్లలను చదివిస్తున్నాడు. నాలుగు సంవత్సరాలుగా ఉన్న పావు ఎకరం పండక అప్పుల పాలు అయ్యాడు. టీ కొట్టు నడుపుకొంటూ జీవనాన్ని నెట్టుకొస్తున్నాడు. విజయ్‌కి ఇంజనీరింగ్ చదువుకి, పుస్తకాలకు, బట్టలకు 23 వేల దాకా ఖర్చు అయ్యింది. అయినా లెక్కచేయకుండా తన పిల్లల చదువులకు అవసరమైతే ఉన్న భూమిని, ఇంటి స్థలాన్ని అమ్ముతానని ధృఢ నిశ్చయంతో చెపుతున్నాడు.

విజయ్ ఇపుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తన నాలుగేళ్ళ కోర్సు తరువాత లక్ష్యం 'ఎంటెక్'. కాస్త ప్రోత్సహించే వారుంటే ఏదైనా సాధిస్తానని విజయ్ మాటల్లో వ్యక్త పరిచాడు.

శూర్పణఖ చెట్టు

త్రినేత్రి

ఓసేవ్...ఆ రేడియో తీసి బ్యాట్రీలవీ తగలెట్టి, దాన్ని పలికేలాచేసి కాస్తంత నా మొహాన పడేయండర్రా... అని మా నాయనమ్మ పొద్దున్నుంచి ఇప్పటికి పదకొండో సారి అడిగింది. విసుగు, తన మాటెందుకు సాగదని ఉక్రోషం కలిపి తాలింపేసినట్లు ఘాటుగానే అడిగింది.

ఇక ఆ రోజు ఆవిడాగదని అందరికీ తెలుసు. అందుకని టీవీ టేబుల్ కింద అరలో ఎప్పట్నించో మూగవోయి ఉన్నదాన్ని తీశాం. అందరం కలిసి వంతులు వేసుకుమరీ ఆ రేడియోను పలికించాం.

"ఇదుగో గౌతమి...అదుగో భద్రాద్రి" పాట వినబడుతూనే దాని సౌండ్ తగ్గిపోయి వ్యాఖ్యాత కంఠం హెచ్చింది.

''అదుగో సీతమ్మవారిని బుట్టలో కూర్చొండబెట్టి పెళ్లి మండపానికి తోడ్కొని వస్తున్నారు. రామచంద్రులవారు ఆ తదుపరి కార్యక్రమం తలుచుకుని సిగ్గులొలకబోస్తున్నారు. అంతలోనే సర్దుకుని రాజసం ప్రదర్శిస్తున్నారు. అయ్యా శ్రీరామచంద్రా..." ఇలా ప్రతీ ఏడాదిలాగే ఆకాశవాణి పెట్టెలలోంచి పలుకుతోంది. అది వింటూ తన్మయురాలై అన్నపూర్ణమ్మ ఉరఫ్ నాయనమ్మ ఆ చేత్తోనే వంట చేస్తోంది.

ఎందుకే నాయనమ్మా... రేడియోలో కంటే టీవీలో అయితే రాములోరి పెళ్ళి ఘనంగా కనబడుతుంది కదా. ఎంచక్కా ఆ రాములవారూ వెడ్స్ సీతమ్మతల్లి కళ్యాణపు "టీవీ సీన్"కే కొబ్బరికాయ కొట్టేసి, హారతిచ్చేయొచ్చు కదా అనంటుంటే మా నాయనమ్మకు తెగ కోపమొచ్చేసింది.

నాయనమ్మా... మేమూ చిన్నప్పుడు అమ్మానాన్న ఆటలో బొమ్మలకు పెళ్ళి ఇలాగే చేస్తే అప్పుడు మమ్మల్ని తెగ కేకలేసేదానివి కదా...మిరిప్పుడిదేంటి చెప్పు అనడిగానా...

ఒసేవ్...గడుగ్గాయీ...నోరుమూసుకుని...నాక్కాస్త ఉల్లిపాయలు తరిగిపెడతావా...మీ అమ్మకు చెప్పి నాలుగంటించమంటావా? అంటూ నా మాటకు జవాబివ్వకుండా దాటేసింది.

శ్రీరామనవమి అంటే ఆయన పుట్టినరోజు కదా... పెళ్ళి చేస్తారేంటి చెప్మా...అంటూ ఉప్మాలో కరివేపాకు లాంటి ప్రశ్నలేసేవాళ్ళూ లేకపోలేదనుకోండి. నరేనయ్యా పుట్టినరోజే... ఓ మహానుభావుడు పుట్టడమంటే లోకకళ్యాణమే కాబట్టి కళ్యాణం చేస్తున్నాం అని తిరుగులేని జవాబూ భక్తుల వద్ద సిద్ధం.

మన తెలుగు నేలమీద శ్రీరామనవమి అనగానే చాలామందికి భద్రాచలం గుర్తొస్తుంది. మా నాయనమ్మలాంటి వాళ్ళకయితే ఇక చెప్పలేం.

నాయనమ్మా...భద్రాచలం వెళ్ళావా అనడిగారంటే చాలు...ఓ నాలుగ్గంటల ఆడియో వీడియో ఎఫెక్ట్‌లోకి తీసుకెళ్ళగలంతటి కామెంటరీ వదులుతుంది.

భద్రాచలానికి ఓ పదిహేను కిలోమీటర్ల దూరంలో పర్ణశాల అనే ఊరుంది అంటూ ఎపిసోడ్ మొదలేస్తుంది. ఆ ఊరికీ...రాముడి రామాయణానికీ విడదీయరానంత సంబంధంతో కథలుకథలుగా చెప్తుంటారు కూడా అని దాని బ్యాగ్రౌండ్ నాయనమ్మ మనముందుకు తెస్తుంది.

రాములోరి రామాయణం పుణ్యమాని అక్కడ కొంతమందికి బతుకుతెరువు చూపిస్తోంది తెలుసా అని మనకు ప్రశ్నలేసి మనల్ని తన నేరేషన్ ఉరవడిలోంచి తప్పించుకోకుండా చేసుకుంటుంది.

ఏమాటకామాట చెప్పుకోవాలి... నాయనమ్మ చెబుతుంటే చక్కటి కథ వింటున్నంత హాయిగా ఉంటుంది. పసిపిల్లల బాలల గ్రంథాలయం అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలే కదా!

పర్ణశాలలో ఏమేం ఉన్నాయో మా నాయనమ్మ మనమూ పర్ణశాలలో ఉన్నంత గాఢంగా చెప్పగలదు.

శ్రీరామచంద్రులవారూ, సీతమ్మవారు, లక్ష్మణులవారు తమ నారబట్టలు ఉతికి ఆరేసుకున్న కొండరాయి...దాని ఆనవాలుగా కొండకు పడిన గుర్తులు మన కంటికి కనబడుతున్నాయా అన్నంతగా చెప్పింది. కూర్చున్నప్పుడు ఆ ముగ్గురి బరువుకి కొండరాయికి పడిన గోతులు ఇప్పటికీ అలానే ఉన్నాయని చెబుతుంటే...నిజంగానే బాలల గ్రంథాలయంలోని బొమ్మల పుస్తకాల అద్భుత ప్రపంచం గుర్తుకు వస్తుంది.

మరి నాయనమ్మా అక్కడికెళ్ళి అవన్నీ చూసి ఏంచేశావూ?

ఏం చెయ్యడవేంటి...ఆ దంపతులు కూర్చున్న చోటుకి ఓ దణ్ణంపెట్టాం. అక్కడ ఈ విశేషాలు చెప్పి మా ముందు జాపిన పళ్ళెంలో తలా ఓ ఐదురూపాయలు దక్షిణవేశాం అనంది.

పోనీలే పాపం ఆ పెద్దమనిషికా రోజు మీ అందరివల్లా ఓ వందరూపాయిలు వచ్చి...ఆ కుటుంబానికి పనికొచ్చుంటాయి.

ఇంకొద్ది దూరంలో ఓ పాడుబడ్డ చెట్టుందిట. దానికల్లంత దూరాన ఓ ముసలావిడ రాళ్ళగుట్ట పెట్టుకునుందిట. రాయికొక రూపాయిచ్చి ఆ చెట్టుమీదకు విసిరి దణ్ణం పెట్టుకోమంటుందిట! అదేవిటే నాయనమ్మా అని మనమడగక పోయినా ఆవిడ ఈ చెట్టు గురించి కచ్చితంగా చెప్పి తీరుతుంది.

''ఒసేవ్...ఆ చెట్టే శూర్పణఖ చెట్టు. ఆ శూర్పణఖ వల్లే సీతమ్మతల్లికన్ని కష్టాలు. అందుకే ఆ చెట్టువీద నాలుగు రాళ్ళేసి దణ్ణంపెట్టుకుంటే మనకూ సీతమ్మవారు పడ్డ కష్టాలు రాకుండా తప్పుతాయి."

"నువ్వూ రాళ్ళేసి శూర్పణఖ చెట్టుని కొట్టావా"

"ఓ ఐదురూపాయిలిచ్చి ఐదురాళ్ళు తీసుకుని కొట్టి దణ్ణం పెట్టుకున్నాను"

"సీతమ్మవారు పడిన కష్టాలు నీకు రాకుండా తప్పాయా మరి?"

"సీతమ్మతల్లి కాబట్టి ఆ కష్టాలు తట్టుకుంది గానీ మనవెక్కడ తట్టుకోగలం...అందుకే ఇలా మొక్కుకునన్నా తృప్తి పడాలిగదుటే"

"ఏం నాయనమ్మా తాతయ్యక్కూడా ఏ శూర్పణఖతోనన్నా క్లాష్ వచ్చిందా"

ఆ మాటకు మా నాయనమ్మకు కోపం, అప్పుడే కూరగాయల సంచితో వచ్చిన తాతయ్యకు నవ్వూ వచ్చాయి.

"శూర్పణఖ అనే ఓ ఆడావిడ వల్ల సీతమ్మతల్లి అనే మరో మహిళాసాధ్వీమణికి కష్టాలొచ్చాయి. అది చెప్పి పర్ణశాలలోని ఓ వృద్ధవనిత రూపాయికొక్క రాయినమ్మి మా ఇంటి అన్నపూర్ణమ్మచేత ఆడదైన శూర్పణఖ మీద ఇన్ని యుగాల తరువాతకూడా రాళ్ళేయించింది కదే నాయనమ్మా"

ఇక ఈ సంభాషణ ఎటుపోయి ఎటొస్తుందనుకుందో మా అమ్మ కలగజేసుకుని పచ్చడి నూరే సీనులోంచి ఈ సీనులోకొచ్చింది.

ఇంక ఆపుతావా ఆపవా...నాయనమ్మను ఆ రేడియో కళ్యాణం విననిస్తావా లేదా అంది గసరుతున్నట్లుగా. ★

అప్పు చేసి పప్పుకూడు తినకుంటేంది...?

కాలువ మల్లయ్య

ఎండాకాలవే కని ఎండలింక ముదురలేదు... వానలు ఇసిరిసిరి కొట్టుడయితె ఎప్పుడో బందయిందీ గని ఎండలయితె ముదురకముందే ఇసిరిసిరి కొడుతున్నయి. వానకాలంల ఎండకాలంల, సలికాలంల గూడ ఎండలే కొట్టవట్టె... గందుకే సానమంది చెట్టునీడకు కూసున్నరు. కొందరు నిల్సోనే ఉన్నరు. ముందున్నది ముసుల్ల పండుగన్నట్టు గిప్పుడే గింతెండలుంటె గాన ఎండకాలం మేల ఎంతుండాలెనని ముచ్చెట్లు వెట్టుకుంటంద్రు...

"అబ్బ గీ చెట్టు నీడకత్తె చల్లగట్క తాగినట్టుంది..." అన్నడు చెట్టు నీడకచ్చి నిల్చుండుకుంట ఒక్కయ్య...

"చల్ల సంగతట్టుండనియ్యిగాని ఇప్పుడు గట్క యాడుంది...? అందరు మెత్కుల బువ్వే తినవట్రి..." అన్నడు అంకయ్య...

"గా మక్కలన్ని కొంచవొయ్య బిస్కిట్లకో, ఇంకేందో నేసుటానికో అమ్మవట్రి.. ఇంగేం తింటరు మరి. మెత్కులు తిని బాగ సుకపడ్తున్నరనుకుంటున్నవానోయ్..."

"ఎంతయిన గట్క తిన్న దాన్కిన్న మెత్కులు తిన్నదానికి ఫరుకుంటదా...? ఉండదా...?"

"మా ఉంటది గని గా మెతుకులేడ అందరికి దొరుకుతున్నయి...? నా కయితె గా గట్క తిన్న కాలమే మంచి గనిపిస్తంది... గట్క తిన్నా గిప్పట్లెక్క రైతులు సచ్చుడయితె లేదుగద..."

"ఏం జేత్తడు పాపంరైతు... ఒగయినచ్చి గిసోంటి వంటలదద్దు... గా దేశపోల్ల లెక్క పండియ్యమనె... కరెంటు సబ్సిడంటె బెదిరిచ్చె. రైతు బాగబల్సి సత్తున్నటనె... ఇగ ఎవసాలు మూలకు పడయా? అప్పులు పెరుగుతె రైతులు ఉరెట్టుకోరా మరి...?"

"ఏ నీయవ్వ ఈరమల్లి బాగ మాట్లాడవడ్తివి... మరి గిప్పుడు సేసుకుంట లేదా ఆత్మహత్యలు..."

"ఎందుకు చేసుకోరు... గీల్లేం సొక్కం పూసలా... గా హైటెక్కు సార్లకంటె రైతు విషయంల కొంచెమంత నయ్యం... భూమ్మీద కాల్లుండయి. ఆలోచనలుంటయి. అందరికి కరెంటు వట్టిగియ్యకున్నా, చిన్నరైతులకిస్తున్నరు గద..! రైతులు ఆత్మహత్యలు చేసుకుంటె గది వట్టిదే అనకుండ ఇంతంత సాయమైతె జేత్తున్నరు గద...! అయినా రైతుల ఆత్మహత్యలు జరుగుడు ఘోరమే మరి. సాయం రైతు కుటుంబాలకు సరిగ్గ చేరెటట్టు జూసుకోవాలె మరి...!"

"ఓ ఇగరైతుల ఆత్మహత్యలేముండయ పటు... ఎందుకంటె మస్తు నీటిపారుదల ప్రాజెక్టులు గడ్తున్నరు గద... వేల కోట్ల అప్పులు దెచ్చి మరీ కడ్తున్నరుగద...! ఇగ ఎవుసాలు మస్తు బందోవస్తుగైతయనుకో... గట్లయితె ఇగ రైతులెందుకు ఆత్మహత్యలు చేసుకుంటరు...! అంతేనావోయ్ ఈరమల్లు..."

"పుట్టు పూర్వోత్తరాలు మ్యానమామ కెరున్నట్టు నీ కాలెడ్డాలు నాకు తెలుసులేవోయ్ వెంకట్నర్సు... ఏ రాష్ట్రపోల్లయిన, దేశపోల్లయిన తమకున్న వనరులేంది...? ఎట్లయితె మస్తుమంది ఓ తీరుగ బతుకుతరని ఆలోసించాలె గని, ఎవ్వల తీరుగనో ఉండన్నని కాపి గొడితె బొక్క బోర్ల పడరా...? మనది నీటివనరులున్న రాష్ట్రం... వ్యవసాయ దేశమన్న సంగతి యాదికుంచుకుంటె మంచిది. గీ వనరులన్నీ వాడుకొని నీటిపారుదల ప్రాజెక్టులన్ని పూర్తిజేత్తె మన రాష్ట్రం సస్యశ్యామలం గాకుంటెమయితది...? గీల్లేదో పొడిసేత్తరని చెప్పుతలేనుగని అందరికి సేతినిండ వనుంటె ఆత్మహత్యలుంటయా... రాయల సీమలోలె కూలికి పొడునుక సచ్చుడుంటదా...? భూములకు నీల్లిచ్చి ఎవుసాలు బాగువడితె ఎన్నితీర్ల మంచిదనుకున్నవు...? కాదంటవా సెప్పు...?"



"గా మాటసరెగని గీ కావన అప్పులు జేసి కడ్తాంటె అప్పులభారం పెరుగుతదిగద...! అయ్యగారి సంపాదన అమ్మగారి పసుపుకుంకుమలకే సాలదన్నట్టు వేల కోట్ల అప్పులు తీర్చుడెట్ల...?"

"గా మాట నిజవే కని మనోల్లు అప్పుజేసి పప్పుకూడు తినుటాని కలువాటయింద్రు... ఒగలేమొ భారతదేశాన్ని తాకట్టుల వెడితె ఇంకొగలు రొండాకులెక్కొనే సదివి అమ్మకానికి భారతదేశమన్నట్టుజేసింద్రు... ఒక్కదేశం చేసినన్ని అప్పులు చేసిన ఘనత మన రాష్ట్రానికుంది... గందుకే అప్పు మనకు కొత్తగాదు..."

"ఎంతయిన గా అప్పులకు గీ అప్పులకు తేడాలేదా...? గయినె వేలకోట్ల అప్పులిచ్చి ఎవుసదార్లకు, సామాన్య జెనాలకు పనికచ్చే ఒక్క ప్రాజెక్టన్న కట్టకపాయె... ఏమన్న హైటెక్కు... ఫ్లైఓవర్లనె...గవ్వేమన్న కూడు పెడ్తయా...? గుడ్డనిస్తయా... హద్దుమీరి అప్పులుజేసుడు తప్పేకని గివ్వి సరిగ్గ వాడితె గీ అప్పులకు కొంత అర్థముంది. నెహ్రూకాలం తర్వాత మన రాష్ట్రానికి భారీ నీటిప్రాజెక్టులు వచ్చిందెక్కడ.. ఇవ్వన్ని పూర్తయితె మంచిదే కద...! గిండ్లేమన్న రాజకీయాలుంటె గవ్వీట్ని పక్కన వెడితె మన రాష్ట్రానికయితె గివ్వి సరిపోయేటియే... గిండ్ల చిత్తశుద్ధి ఉండాలన్న మాట నిజమేకని రాజకీయాలల్ల గదానికోసం వెతుకుడు వట్టిపనే. గుడ్డిల మెల్ల అన్నది సూడాలె..."

"ఈరమల్లియ్యాల్ల జోరుగనే సెప్పుతున్నడుగని ఎవ్వలైన సరె అడ్డగోలు అప్పులు చేసుడయితె మంచిదిగాదు. తిన్న కాడికాయేంది. ఉన్న దాంట్ల నడిపిచ్చుకుంటయిపాయె... ఆకలికంటె ఆత్మగౌరవం ఎక్కువన్నరు... అప్పులుజేత్తె ఇచ్చినోని ముంగట తీసుకున్నోడు లోకువగాడా...? గా అప్పుల భారం తోనే కద రైతులు సచ్చుడు..."

"ఇంత పొడుగు నీతులు మా సెప్పినవు తియ్య...! మంచి కోసం అప్పులు జేత్తె తప్పేంలేదు. మంచిపనులకప్పుజేత్తె తప్పేంలేదు... మరి గీ ప్రాజెక్టులన్ని కట్టన్నంటె గన్ని పైసలేన్నుంచి రావాలె...?"

"రాజమల్లన్న...! నువ్వేం మాట్లాడ్తలెవ్వేందే...?"

"అటూ ఇటూ రొండు దిక్కుల జోరుగనే మాట్లాడ్తున్నరు గద... ఇగ నేను మాట్లాడుటానికేముంటది గని నన్నడుగుతె పరుగెత్తి పాలు తాగిందాని కంటె నిల్సోని నీల్లు తాగింది మేలంట... కని మనోల్లేడ ఊకుంటరు...? ఉరికురికి ముక్కుదూలం పలుగ్గొట్టుకుంటరు... అప్పులతోని మోయలేనంత భారం ప్రజలమీద పడుడు మంచిదిగాదు. కని గా పనే సేత్తున్నరు మనోల్లు... అప్పుజేసి పప్పుకూడని ఒగయినె బోర్లవడితె, ఇంకొగయినె మంచిపనులకు అప్పని ఉరుకులాడుతుండు. కొన్ని పనులు తప్పక పోవచ్చుకని గది ప్రజలమీద భారం పడకుండ సూడాలె... మెల్లె మెల్లెగ సెయ్యాలెగని ఏగిర్త పడకుంటెనే మంచిది... పోతె గీ మాట నిష్ఠూరంగ అనిపించచ్చుగని గిట్లజేత్తె మంచిదిగద...! అప్పులు చేసిందానికంటె పెద్దపెద్దోల్లు ఆక్రమించుకున్న భూములను, ఆస్తులను, ఇన్‌కమ్ టాక్స్ బకాయిలను, ఆదాయాన్ని మించి సంపాయించిన ఆస్తులన్నీట్ని గవర్నమెంటు స్వాధీనం జేసుకుంటె మంచిదిగద... ఇగ అప్పులెందుకు...? గీ పని ఎవ్వలు రాజ్జానికచ్చినా సెయ్యరు... గందుకే అప్పులు తప్పుతలెవ్వు..."

అన్నడు రాజమల్లు...

గా మాటలకందరు నువ్వద్దేనని ఖుషీ అయ్యింద్రు. ★

మందబుద్ధికి కారణం మేనరికాలా?

డా॥ రమణ యశస్వి

ఇటీవలి కాలంలో చిన్నపిల్లలో తరుచుగా సెరిబ్రల్ పాల్సీ జబ్బువస్తోంది. వివిధ కారణాలతో వచ్చే ఈ వ్యాధి గురించి, దాని లక్షణాల గురించి సరైన అవగాహనలేక తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మేనరికం ద్వారా పుట్టిన పిల్లల్లో ఈ లక్షణాలు అధికంగా వుంటున్నాయి. సెరిబ్రల్ పాల్సీ వ్యాధి లక్షణాలు, చికిత్సా పద్ధతుల గురించి తెలుసుకుందాం.

సెరి(బల్ పాల్సీ అంటే...

ఎదిగే మెదడుకు ఆక్సిజన్ సరఫరా సరిగ్గా కాక, పిల్లల్లో చురుకుదనం, ఎదుగుదల (మైల్ స్టోన్స్) తగ్గి వంకర టింకరగా కండరాలు (స్పాస్టిసిటి) పని చేయదాన్ని సెరి(బల్ పాల్సీ అంటారు.

ఇందుకు గల కారణాలు

1. మేనరికం ద్వారా పుట్టిన పిల్లలు

2. తల్లి గర్భంలో ఉన్నప్పుడు: తల్లికి రక్తహీనత, గుర్రపువాతం, పౌష్టికాహార లోపం. మొదటి మూడు నెలలు గర్భిణీ సమయంలో ప్రమాదకర మందులు - డాక్టర్లు సూచించని మందులు వాడడం, మంప్స్, రూబెల్లా, మీజిల్స్ వంటి వైరల్ జ్వరాలు తల్లికి రావడం. కవల పిల్లలు.

3. ప్రసవ సమయంలో

- కష్టమైన కాన్పు
- బిడ్డ మెడచుట్టూ అంబెలికల్ కార్డ్ వరుసుకుపోవడం.
- బిడ్డ ఉమ్మనీరు తాగినప్పుడు
- బిడ్డ పుట్టగానే ఏడ్వనప్పుడు
- నెలలు నిండకుండానే ప్రసవం జరిగినప్పుడు ఈ సెరి(బల్ పాల్సీ వచ్చే అవకాశాలు ఎక్కువ.

4. పుట్టిన తరువాత:

బిడ్డకు పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, మెదడు వాపు వ్యాధి పుట్టిన నెలలోపు పిల్లలకి వచ్చిన ఎడల సెరి(బల్ పాల్సీ వచ్చే అవకాశం ఎక్కువ.

వ్యాధి లక్షణాలు:

ఏడాది లోపు పిల్లల్లో

మెడ నిలపలేరు. మెల్ల కళ్ళు, ఎదుగుదల ఆలస్యం (డిలే మైల్ స్టోన్స్) కావడం, తక్కువ మానసిక ఎదుగుదల, నోటి నుండి చొంగ కార్చడం, ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) వంటి లక్షణాలు వుంటాయి.

ఏడాది, ఆ తరువాత పిల్లల్లో లక్షణాలు:

చిన్న తల, మెల్ల, చొంగ కార్చడం, సరిగ్గా కూర్చోలేకపోవడం, నిలబడలేకపోవడం, నడవలేకపోవడం, స్పాస్టిసిటి (స్టిఫెనెస్) వల్ల విరుచుకొని పోయే కాళ్ళు, చేతులు, నడుము, అమాయకపు నవ్వు, చూపు, మాటలు రాకపోవడం, వచ్చినా నత్తి, అస్పష్టపు మాటలు, ఫిట్స్, మానసిక ఎదుగుదల తక్కువగా ఉంటుంది.

నడకలో ప్రత్యేక లక్షణాలు

ఈక్వయినస్ గెయిట్ - అంటే మునివేళ్ళ మీద నడవడం, సిజరింగ్ గెయిట్ - అంటే నడిచినప్పుడు రెండు కాళ్ళు పెనవేసుకొని కత్తెరలాగా పడతాయి, జంపింగ్ గెయిట్ - అంటే మోకాళ్ళ దగ్గర, తొంటి దగ్గర వంగి నడుస్తారు. బన్నీ హాంపింగ్ - అంటే నడవలేని పిల్లలు కుందేలు లాగా గెంతుతూ ఒక చోటి నుంచి ఇంకో చోటికి కదులుతారు.

డబ్ల్యూ సిట్టింగ్ - అంటే ఈ పిల్లలు ఇంగ్లీషు అక్షరం డబ్ల్యూ ఆకారంలో కూర్చోడం, అలాగే పాకడం చేస్తుంటారు.

స్పాస్టిసిటి అంటే ఏమిటి?

వాడుక భాషలో స్పాస్టిసిటి అంటే రిజిడిటి, టయిట్‌నెస్, స్టిఫెనెస్ అని చెప్పుకోవచ్చు. అదే తెలుగులో అయితే బిగుతయిన కండరాలు, కీళ్ళు. ఇది రెండు రకాలుగా ఉంటుంది.

1. న్యూరో లాజికల్ (నరాలకు సంబంధించినది)

2. మస్కులో స్కెలిటల్ (కండరాలకు, కీళ్ళకు సంబంధించింది)

ఈ రెండింటినీ గుర్తించడం చాలా సులభం. నరములకు సంబంధించిన స్పాస్టిసిటి అయితే కొంతమేరకు అదృశ్యం అవుతుంది. పిల్లవాడు పెరిగే కొద్దీ స్టిఫ్‌నెస్ పెరుగుతుంది. కాబట్టి తెలివిగల తల్లిదండ్రులు 'చిన్నప్పుడు నిద్రపోయేటప్పుడు స్టిఫ్‌నెస్ ఉండేది కాదు. వయస్సు పెరిగే కొద్దీ నిద్రలో కూడా బిగుసుకు పోతున్నాడండి' అని చెప్పగల్గుతారు.

రెసిస్టెంట్ స్పాస్టిసిటి:

➤ మూడు నుంచి ఆరు నెలల దాకా ఫిజియోథెరపి చేసినప్పటికీ ఏ మాత్రం తగ్గని బిగుతుదనాన్ని మొండి బిగుతుదనం అంటారు.

హోమ్ ఫుల్ స్పాస్టిసిటి అంటే?

➤ ఇది ప్రమాదకరమైన బిగుతుదనం. ఇది కండరాల పనిని పూర్తిగా దెబ్బతీసి రోగి రోజువారీ కార్యక్రమాలకు అడ్డువస్తూ వుంటుంది. దీనికి కొన్ని ఉదాహరణలు...

గుప్పెట చెయ్యి: చెయ్యి ఎప్పుడు గుప్పెట పట్టే ఉంటుంది. దీని వల్ల ఏమీ చెయ్యలేరు. లోపల గజ్జి పుండ్లు వస్తాయి. మణికట్టు దగ్గర వంపు, ముంజేయి కింది భాగం వంపు, భుజం లోపలికి తిరిగిపోవడం ఇవన్నీ రోగిని ఏ పనీ చేయలేని స్థితికి తీసుకొని వెళతాయి. రెండు కాళ్ళు మెలికలు పడడం (కత్తెర లేక సిజరింగ్) మోకాళ్లు వంగి పోవడం. ఈక్వయినస్ - మునివేళ్ళ మీద నడవడం. ఇవన్నీ రోగిని సరిగ్గా నడవనీయకుండా అడ్డుపడతాయి.

స్పాస్టిసిటిని ఇంకో రెండు రకాలుగా కూడా చెప్పుకోవచ్చు. ఇందులో మొదటిది.

1. "విస్తృత ఆ(డిఫ్యూజ్) స్పాస్టిసిటి: ఇది విస్తృతంగా శరీరం మొత్తానికి లేదా కాళ్ళను కాని, చేతులను కాని ఆవహించి ఉంటుంది. ఉదాహరణకు మోనోపెరిసిస్ అంటే ఒక కాలు కాని, చెయ్యి కాని బిగుతుగా ఉంటుంది. డైపెరిసిస్ అంటే రెండు కాళ్ళు బిగుతుగా ఉంటాయి. క్వాడ్రిపెరిసిస్ అంటే రెండు కాళ్ళు, రెండు చేతులు బిగుతుగా ఉండడం. హెమిపెరిసిస్ అంటే ఒక పక్క చెయ్యి, కాలు బిగుతుగా ఉండడం.

2. కేంద్రీకృత ఫోకల్ స్పాస్టిసిటి: కాళ్ళలోకాని, చేతుల్లో కాని కొన్ని కండరాల సముదాయం బిగుతుగా మారుతుంది.

నివారణ మార్గాలు

వ్యాధి వచ్చిన తరువాత నయం చేసుకోవడం కన్నా దానిని రాకుండా నివారించుకోవడమే మంచిదన్న నానుడి ఈ సెరిబ్రల్ పాల్సీ జబ్బుకు కూడా వర్తిస్తుంది.

భారతదేశంలో పోలియో మహమ్మారిని మట్టుబెట్టబోతున్న సమయంలో ఈ సెరిబ్రల్ పాల్సీ కోరలు చాస్తున్నట్లు వుంది. దీన్ని నివారించగలగడమే ఉత్తమం.

అందుకు మార్గాలు

గర్భిణీ స్త్రీలు క్వాలిఫైడ్ మెటర్నటీ డాక్టర్ల చేత తొమ్మిది నెలలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. ఆసుపత్రులలోనే ప్రసవం కావాలి. మేనరికం పెళ్ళిళ్ళు సాధ్యమైనంత వరకు చేసుకోకూడదు. గర్భిణీ స్త్రీలు ఏ మందులు పడితే ఆ మందులు డాక్టర్ సలహా లేకుండా వేసుకోకూడదు. రక్తహీనత, మిగతా వైరల్ జబ్బులు రాకుండా రోగ నిరోధక శక్తిని పెంచే సమతుల్య ఆహారం తీసుకోవాలి. కాన్పు చేసే డాక్టర్లు ప్రసవ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకొని, పుట్టిన పిల్లల బ్రెయిన్ దెబ్బ తినకుండా చూడాలి. పుట్టిన పిల్లల్లో పచ్చకామెర్లు, మెదడుకు సంబంధించిన వైరల్ జబ్బులకు సకాలంలో చికిత్స అందేలా చూడాలి.

చికిత్స పద్ధతులు

చికిత్స ముఖ్యోద్దేశం స్పాస్టిసిటి స్థాయిని తగ్గించి రోగిని రోజువారీ కార్యక్రమాలకు ఎవరిమీదా ఆధారపడకుండా నడవగల స్థాయికి తీసుకొని రావడం. ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి. పిల్లలలో స్పాస్టిసిటి ఉందని అనుమానించగానే తక్షణ చికిత్స మొదలు పెడితేనే ఆ రోగి పరిస్థితిలో గరిష్ట స్థాయిలో మెరుగుదల సాధ్యపడుతుంది.

ఫిజియోథెరపి

వివిధ చికిత్స పద్ధతులలో అతి ముఖ్యమైనది. పిజియోథెరపి, ఆక్యుపేషనల్ థెరపి వంటి ప్రత్యేక వ్యాయామం. స్పాస్టిసిటి చికిత్సలో వ్యాయామం చాలా ముఖ్యమైన అంశం. అయితే అందరూ దీనిని తరచుగా నిర్లక్ష్యం చేస్తుంటారు. నిజానికి ఇది పిల్లవాడి తల్లిదండ్రుల ఓర్పును పరీక్షిస్తుంది.

సాధారణంగా ఫిజియోథెరపి జోలికి పోకుండా సులభమైన మందులు, శస్త్రచికిత్సలతో చికిత్స చేయాలని చూస్తుంటారు. కాని అలా చేయడం సరైన పద్ధతి కాదు. పిజియోథెరపికి సరైన ప్రత్యామ్నాయం ఏదీ లేదు.

ఫిజియోథెరపి చికిత్స పొందే వారికి కదలికలలో బ్యాలెన్స్ పెంపొందించేందుకు, స్వయం నియంత్రణలో పెరుగుదలకు, దారుఢ్యానికి, నైపుణ్యానికి దోహదం చేస్తుంది. ఆ విధంగా రోగి కదలికలు (మోటారు ఫంక్షన్) మెరుగుపడేందుకు ఉపయోగపడతాయి.

ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సా విధానం

జెడ్‌ప్లాస్టీ చేసి కండరాల బిగుతును తగ్గించడం, మజిల్ రిలీజ్, సాఫ్ట్ టిస్యూరిలీజ్, ఎముకపై ఆపరేషన్లు ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సా విధానాలు.

న్యూరో సర్జరీ శస్త్ర చికిత్సలు

సెలక్టివ్ మోటారు ఫాసిక్యులాటమి.

రైసోటమి స్పాస్టిసిటీ అనేది నాడి వ్యవస్థకు సంబంధించిన అనారోగ్యమే కానీ కండరాలకు, ఎముకలకు సంబంధించి కాదు. కాబట్టి కండరాలకుగాని, ఎముకలకుగాని శాశ్వతమైన మార్పులు జరిగితే కానీ శస్త్రచికిత్స చేయడం మంచిది. మన దేశంలో సెరెబ్రల్ పాల్సీ గురించి చాలా తక్కువగా తెలిసి ఉండటంవల్ల, నిర్ధారణ ఆలస్యంగా జరుగుతుండటం వల్ల సత్వర చికిత్స గురించి సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం వల్ల వైఫల్యాలు ఎక్కువగా తలెత్తుతుంటాయి. ★

డెంటల్ కేర్ క్విజ్-3

నిర్వహణ: డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. దవడలలో స్థిరదంతాల రాకడ (ఇరప్షన్)ఏ వయస్సులో ప్రారంభం అవుతుంది.
   అ) ఆరవ సంవత్సరం ఆ) ఎనిమిదవ సంవత్సరం
   ఇ) పదవ సంవత్సరం ఈ) పన్నెండవ సంవత్సరం
2. ఆరు సంవత్సరాల వయస్సులో వచ్చే దంతాలు
   అ) మధ్య కొరుకుడు పన్ను + ప్రక్క కొరుకుడు పన్ను
   ఆ) మధ్య కొరుకుడు పన్ను + మొదటి విసురుడు దంతం
   ఇ) మధ్య కొరుకుడు పన్ను + రెండవ విసురుడు దంతం
3. స్థిర దంతాల మొత్తం సంఖ్య
   అ) ఇరవై రెండు ఆ) ముప్పై రెండు
   ఇ) నలభై రెండు ఈ) పన్నెండు
4. ఒక్కో దవడలో వుండే స్థిర దంతాల సంఖ్య
   అ) పన్నెండు ఆ) పద్నాలుగు
   ఇ) పదహారు ఈ) ఎనిమిది
5. అన్నింటికంటే దవడలో ఆఖరున వచ్చే స్థిర దంతం
   అ) మొదటి విసురుడు దంతం ఆ) రెండవ విసురుడు దంతం
   ఇ) మూడవ విసురుడు దంతం ఈ) కొరుకుడు పన్ను (ఇన్సిజార్)
6. మూడవ విసురుడు దంతం సాధారణ ప్రజానీకం నోళ్ళల్లో యిలా వానుతుంటుంది
   అ) థర్డ్ మోలార్ ఆ) థర్డ్ గ్రైండింగ్ టీత్
   ఇ) థర్డ్ ప్రీ-మోలార్ ఈ) జ్ఞానదంతం
7. పాలపళ్ళ కంటే స్థిరదంతాలు
   అ) పన్నెండు ఎక్కువ ఆ) పది ఎక్కువ
   ఇ) పదకొండు ఎక్కువ ఈ) పదిహేను ఎక్కువ
8. పాలపళ్ళలో కన్పించని పంటి రకాలు
   అ) ప్రీ- మోలార్స్ ఆ) థర్డ్ మోలార్స్
   ఇ) సెకండ్ మోలార్స్ ఈ) ప్రీ-మోలార్స్ + థర్డ్ మోలార్స్
9. అసలు పళ్ళతో పాటు దవడలో అదనంగా వచ్చే పళ్ళను
   అ) సూపర్ న్యూమరీ టీత్ అంటారు. ఆ) అడిషనల్ టీత్ అంటారు.
   ఇ) ఎక్స్‌ట్రా టీత్ అంటారు. ఈ) పైవన్నీ సరైనవే
10. 'పై దవడ' సాంకేతిక నామం
   అ) మాక్సిలా ఆ) మాండిబుల్
   ఇ) పాలెటి ఈ) మోలార్ బోన్

ముళ్ళపూడివెంకటరమణ
సినీ రమణీయం-1,2 భాగాలు
సంపా: ఎమ్బీయస్ ప్రసాద్
ఒక్కొక్కటి 150 రూ.
ముద్రణ మరియు
ప్రతులకు: విశాలాంధ్ర
పబ్లిషింగ్ హౌస్

సినీ రమణీయం

ముళ్ళపూడి వెంకటరమణ రచయితగానేకాదు. సినీ విమర్శకుడిగా, సినీ రచయితగా, నిర్మాతగా కూడా రమణ విశ్వరూపాన్ని ఈ 'సినీ రమణీయం' ఒకటి, రెండు భాగాలలో చూడవచ్చు. ఆంధ్రవారపత్రికలో పనిచేసేరోజుల్లో ముళ్ళపూడి వెంకటరమణ సినిమాల గురించి రాసిన వార్తలు, విదేశీ చిత్రాల కథలు, ప్రముఖులతో ఇంటర్వ్యూలు, వారిపై కథనాలు, వ్యాసాలు, సినిమా పోకడలపై వ్యంగ్య శీర్షికలు, దేశ, విదేశీ చిత్రాలపై సమీక్షలు ఇలా ఆయన స్పృశించని అంశమంటూ లేదు.

ఇందులో గుమ్మడి, ఎస్.వి. రంగారావు, కన్నాంబ, రేలంగిలాంటి మేటినటులపై - నాగిరెడ్డి, కె.వి. రెడ్డి, బి.ఎన్.రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, సదాశివబ్రహ్మం, యల్.వి. ప్రసాద్, చక్రపాణి లాంటి సాంకేతిక నిపుణులపై సముద్రాల, భానుమతి, సాలూరు రాజేశ్వరరావు, రమేష్‌నాయుడు, నౌషాద్, పి.బి. శ్రీనివాస్, శంకర్-జైకిషన్, సి. రామచంద్ర, ఆరుద్ర మొదలైన సంగీత దర్శకులు, వాళ్ళ ప్రజ్ఞావిశేషాలను సునిశిత విశ్లేషణ, వ్యంగ్య వైభవంతో వివరించిన విధానం బాగుంది. రేలంగి, ఆదుర్తి, భానుమతి, ఎస్. రాజేశ్వరరావులపై వున్న వ్యాసాలు డిఫరెంట్‌గా వుండి మనల్ని అలరిస్తాయి. ప్రముఖ హాలీవుడ్ నిర్మాత సిసిల్ బి డిమిల మీద తర్వాతికాలంలో ఎన్నో వ్యాసాలు వచ్చినా 1959లో రమణ రాసిన వ్యాసమే ఇప్పటికీ ప్రామాణికం. అలాగే హాలీవుడ్ చలనచిత్ర కళాపరిణామాన్ని, కొన్ని మంచి చిత్రాల గురించి, హాస్యనటుల గురించి రాసిన వ్యాసాలు కూడా ఎన్నదగినవే.

ఇక సినీ వ్యంగ్య కథలలో ప్రముఖ కథలను అనుసరిస్తూ సినీ వేషాలకోసం వచ్చినవారిని "కొత్తముఖాలు"గా, బెంగాలీ కథలు మోజును "చెత్రేర్ - చెదారేర్" గా, ఎప్పటికీ తీయని నెక్స్ట్ పిక్చర్ గురించి, రిపీట్ సినిమాలు పొరపాటున హిట్ అయి "నత్తు బేడలు" కూడా చెల్లిపోతాయని నిరూపిస్తారు. ఒక అనామకుడి సినీరంగ ప్రవేశం గురించిన పెద్దకథే "విక్రమార్కుని మార్కుసింహాసనం కథలు". భోజరాజును మెట్టుమెట్టుకూ హెచ్చరించిన విక్రమార్కుడి సింహాసనం తాలూకు సాలభంజికల లాగానే మన నాయకుడురాజుకు అడగడుగునా అడ్డుపడ్డవాళ్లందరూ కథలు చెబుతారు. వాళ్ల కథలూ, వాళ్ళుచేసిన మోసాలు రాజుకే కాదు. సినీ ఫీల్డులో అడుగుపెట్టదల్చుకున్న వాళ్లందరికీ లోకజ్ఞానం నేర్పేతాయి. ఈ కథలన్నీ రమణ మార్కు హాస్య - వ్యంగ్యాలకు ప్రతీకలు.

కథానాయకుడు ఏ. నాగేశ్వరరావుకు, రచయిత రమణకు వున్న అనుబంధం చాలా గొప్పది. అక్కినేని నాగేశ్వరరావు తన జీవితాన్ని గెల్చుకున్న తీరును, అతనెక్కిన కీర్తిశిఖరాలను 'కథానాయకుని కథ'గా రమణ తీర్చిదిద్దారు. అప్పట్లో విపరీతంగా అమ్ముడుపోయిన ఈ పుస్తకం, ఇప్పుడు తిరిగి ఇందులో చోటుచేసుకోవడం విశేషమే. ఇక సమీక్షా విభాగంలో రమణ తెలుగు, హిందీ, ఇంగ్లీషులోని ప్రముఖ చిత్రాలపై చేసిన సమీక్షలను ఇచ్చారు. అది ఎంత గొప్ప చిత్రమైనా, తీసినవారు ఎవరైనా నిష్పక్షపాతంగా తనదైన హాస్య, వ్యంగ్యాలతో విమర్శను గుప్పించిన రమణ సమీక్షకుడిగా కూడా తనదైన ప్రత్యేకముద్రను వేయగలిగారు. రమణకున్న నిష్పక్షపాతం, సినీ పాండిత్యం, భాషా సలహాలు ఈనాటి కొత్తతరానికి ఆదర్శప్రాయం. సినిమాల మీద ఆసక్తి వున్నవారికే కాకుండా, సినీమారంగాన్ని అధ్యయనం చేసేవారికి కూడా ఈ పుస్తకాలు రెఫరెన్స్‌లాగా నిలిచిపోతాయి.

-కె.పి. అశోక్‌కుమార్

నగరానికి ఓ పార్శ్వం

పద్యాల నడుముల్ని విరిచిన పరంపరతో వచనం రోజురోజుకూ తన స్వరూపాన్ని మార్చుకుంటుంది. ఆ క్రమంలో అనేకానేకరూపాల్లో కవులు, రచయితలు, భాషావేత్తలు వచనాన్ని పాఠకులకందించారు. ఏ రూపం, ఎంతమేరకు పాఠకులకు దగ్గరయ్యిందో, ఏ మేరకు పాఠకులు ఆపాదించుకున్నారో చెప్పడం కష్టం. ఏ రూపంలో వచనం "ఎంతకాలం పాఠకుల నాల్కలపై నానిందో" అన్న విషయాన్ని బట్టి ఫలానా ప్రక్రియలో వచనం ఎక్కువగా పాఠకులకు చేరువయ్యిందని చెప్పవచ్చు. వచనం అంతా ఒకే లక్ష్యాన్ని కల్గి ఉన్నప్పుడు ఇన్ని ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో అవసరమా? అన్న ప్రశ్నకు తక్షణంగా అవసరమే అని చెప్పారు పెద్దలు. ప్రాచీన సాహిత్యంలో కవి తన ప్రౌఢతను బట్టి కథలోని సందర్భం అవసరాన్ని బట్టి పాఠకునికి ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, కందం వంటి ఛందస్సుల్లో అందించేవాడు. ఆ వాసనే నేటి వచన సాహిత్యంలో కొనసాగింపుగా అనేక ప్రక్రియలు మినీకవిత, హైకూ, నానీ, దీర్ఘకవిత వంటివి. కవితను చెప్పదలుచుకున్న విషయగాఢతను బట్టి, తన కలం పదునుబట్టి ప్రక్రియను ఎన్నుకొంటాడు. ముఖ్యంగా దీర్ఘకవితకు ఓ ప్రత్యేకమైన లక్ష్యం ఉంది. వెసులుబాటు ఉంది. కాకపోతే దండకి దారంలా అంతే! సూత్రీకరణకవి జారవిడిస్తే తేలిపోవడమూ ఉంది. అందుకే దీర్ఘకవిత అందునా నేటి ఈ స్పీడ్‌ప్రపంచానికి, ఈ పోటీ ప్రపంచానికి సరిపడేదికాదనే అపవాదూ దీనిమీద లేకపోలేదు. అలాంటి ఈ సందర్భంలో కె. హరినాథ్ "నగరంలో నగ్న సత్యాలు" దీర్ఘకవిత తీసుకురావడం పెద్దసాహసమే.

ఈ ముప్పై అయిదు పేజీల పుస్తకం నిండా నగరంలో (ముఖ్యంగా రాజధానిలో) జరిగిన, ఇంకా కొనసాగుతున్న సంఘటనల్ని పాఠకులకి ఒక దృశ్యం తరువాత దృశ్యాన్ని సినిమా రీలులా పాఠకునికి అందించే ప్రయత్నం చేశాడీకవి. నగరం గురించిన ఉపోద్ఘాతాన్ని మొన్న, నిన్న, నేడుగా ప్రొ॥ ఎస్వీ సత్యనారాయణ సమకూర్చడంతో పాఠకుడు ఈ పుస్తకంలో కవి చెప్పబోయే విషయాల్ని ముందుగానే పసిగడతాడు. ఈ విషయంలో సులభతరమూ ఉందీ, ఇంకేముందిలే యాంటి నగర కవిత్వం అని తేల్చేసే ప్రమాదమూ ఉంది. దీర్ఘకవిత విషయానికొస్తే అక్కడక్కడా మెరుపు మెరిసినట్టు. చెమక్కులు, చురకలు ఉన్నాయి. వాటిల్లో కొన్నిచూద్దాం.

మహాత్ముల పేర్లున్న వీధులు మాయం/ శిధిలావస్థలో ప్రభుత్వ పాఠశాలలు కూలిన గోడలమధ్య పాఠాలు/ ఇంటర్నెట్ల సుడిగుండాలు సైబర్ నేరాల చిట్టాలు/ పాకిపోయిన పారెన్‌కల్చర్ పాతుకుపోయిన డైవర్స్‌వెంచర్.

ఈ దీర్ఘ కవితలోని ఇలాంటి పాదాలు పాఠకుల్ని ఆలోచింపజేయడమే కాదు. అయ్యో అన్పిస్తూ భవిష్యత్ ఏమవుతుందోనన్న భయాన్నీ, ఆందోళనను కల్గేట్లు చేయడం కవి రచన ప్రౌఢతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. నగరంలో సత్యాలు కవి మాటల్లో నగ్నంగానే పాఠకునికి నేరుగా చేరాయనడానికో ఉదాహరణ.

కాలుష్య కాసారాలు/ పొల్యూష్యన్ కమ్ముకున్నరోడ్డు / సొల్యూషన్‌కై/ప్రయత్నించని నాయకులు.

నగరం రోజుకో రూపాన్ని మార్చుకుంటున్న వైనాన్ని కవి కళ్ళకు కట్టినట్లు చూపడంలో విజయం సాధించాడు. సిటీబస్సుల్లో వేలాడే ప్రయాణం, సమాధుల పునాదుల్నించి లేచే అక్రమకట్టడాలు, మలినమవుతున్న ఆశ్రమాలు, విఫలమవుతున్న ప్రభుత్వ యంత్రాంగంవంటి ఎన్నో విషయాల్ని పాఠకునికి అందించాడీకవి. కాకపోతే అంతా చదివిన పాఠకులు చివరికి నగరంలో తుపాకి దూసిన నటున్ని గుర్తుచేసిన కవి, ప్రపంచబ్యాంకు తొత్తుల్ని కంటున్న ఎల్.పి.జి. మానవత్రికలు, హైటెక్‌సిటీ, కొండచిలువల్లా విస్తరించుకున్న ఫ్లైఓవర్స్‌ని గుర్తుచేయకపోవడం పట్ల నిరాశచెందుతారు.

-సైదుల ఐనాల



నగ్న సత్యాలు
కె. హరనాథ్
వెల: రూ. 30/-
పేజీలు: 35
ప్రతులకు: విశాలాంధ్ర
బుక్‌హౌస్ అన్ని బ్రాంచీల్లో

దేశభక్తిని గుర్తుకు తెచ్చే వాడపల్లి వెంకన్న ఆలయం

యేడిద వెంకటేశ్వరావు

దైవభక్తి భావంతోపాటు దేశభక్తి భావాన్ని కూడా జ్ఞప్తికి తెచ్చే వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం సందర్శిస్తే అర్థమవుతుంది. 1931లో స్వాతంత్ర్యసమరయోధుల స్మారక చిహ్నం ఏర్పాటు ఈ ప్రాంతం దేశభక్తికి సాక్షీభూతంగా నిలుస్తోంది. బ్రిటీష్ హయాంలో ఏర్పాటుచేసిన స్మారక చిహ్నం నేటికి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.



భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, తూర్పుగోదావరిజిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంనకు అవినాభావ సంబంధముంది. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు నిరసనగా 1931 మార్చి 30న స్వామివారి కళ్యాణం రథోత్సవం సందర్భంగా, తీర్థం రోజున ఉత్సవ రథంపై జాతీయ పతకాన్ని, మహాత్మాగాంధీజీ చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. బ్రిటీష్ సైనికులు వాటిని ఎన్నిమార్లు తొలగించినా దేశభక్తులు మళ్ళీ మళ్ళీ ప్రతిష్ఠిస్తూ వచ్చారు. పోలీసు అధికారి "ముస్తాఫా అలీఖాన్" ఈ కార్యక్రమాన్ని ఆపివేయాలనే నిర్ణయంతో ఒకేసారి భక్తులపై లాఠీచార్జి, తుపాకి కాల్పులు ప్రారంభించాడు. ఇంతజరిగినా దేశభక్తుల దృఢనిశ్చయం మారలేదు. గాంధీజీ చిత్రపటం రథంపై చిరునవ్వులు చిందిస్తూనే ఉంది. జెండా అలాగే ఎగురుతూనే ఉంది. బ్రిటీష్ సైనికులు జరిపిన కాల్పులకు నలుగురు దేశభక్తులు నేలకొరిగారు. కాల్పులు, లాఠీ చార్జీకి ప్రజలు బయటపడలేధు. బ్రిటీష్ వారిపై తిరగబడ్డారు. వారి దాటికి తట్టుకోలేని బ్రిటీష్ పాలకులు, పోలీసులు పారిపోయారు. ప్రతీఏటా ఈ క్షేత్రంలో చైత్రశుద్ధ ఏకాదశిరోజున స్వామివారితీర్థం నిర్వహిస్తారు. రథోత్సవంలో భక్తులు ప్రాణాలర్పించినచోట వారి జ్ఞాపకార్థం స్థూపం నిర్మించారు.

1759లో పెద్దాపురం సంస్థానాధీశులు రాజావత్సవాయి తిమ్మజగపతి మహారాజు స్వామివారిని దర్శించి ధూపదీప నైవేద్యాలు, సేవల నిమిత్తం 275 ఎకరాల భూమిని స్థిరాస్తిగా బహుకరించారు.

గౌతమీ గర్భంలో స్వామి. కృతయుగంలో నైమిశారణ్యంలో సత్రయాగం జరిపినప్పుడు, రక్తచందన వృక్షాన్ని స్వామి రూపంగా మలిచి యాగపరిసమాప్తి చేసి నదిలోకి విడిచి పెట్టారని పురాణాలు చెబుతున్నాయి. అప్పటినుంచి స్వామి అనేక నదులలో పరిభ్రమిస్తూ కలియుగం ప్రథమపాదంలో వాడపల్లికి చేరి భూమిలో ఉండిపోయాడని ప్రతీతి. ఆ ప్రాంతాన్ని పాలించే రాజుకు గుడికట్టించి ప్రతిష్ఠింపచేశాడు. కొంతకాలానికి గౌతమి గోదావరి అటువైపు విస్తరించడంతో స్వామి వారి ఆలయం అందులో మునిగిపోయింది. దేశంలో రక్తచందనం కర్రవిగ్రహం మరెక్కడా లేకపోవడం, వాడపల్లిలోనే ఉండటం గమనార్హం.

పెద్దతిరుపతి, ద్వారకా తిరుమల తర్వాత, తూర్పు, పశ్చిమ గోదావరి ప్రజలు మరో తిరువతిగా భావించుకొని శ్రీవెంకటేశ్వరస్వామిని సేవించుకొనే క్షేత్రం వాడపల్లి. అఖండ గోదావరి రాజమండ్రి సమీపంలో ధవళేశ్వరం వద్ద రెండుపాయలుగా విడిపోతుంది. గౌతమీ, వశిష్ఠ పాయలుగా చెరోవైపు విడిపోయి 100కి.మీ. దూరం ప్రవహించి సముద్రంలో కలుస్తాయి. ఈ రెండు పాయల మధ్యనున్నదే కోనసీమ. కొబ్బరితోటలతో, పంటకాలువలతో, పచ్చనివరిచేలలో, ఉద్యానవనాలను మరిపించే పూల తోటలతో నిరంతరం హడావిడిగా గడిపే ఆధునిక ప్రజలకు కోనసీమ ప్రదేశం ప్రశాంతతను చేకూరుస్తుందని పర్యాటకులు చెబుతుంటారు.

తూర్పుగోదావరి జిల్లాలో మండల కేంద్రమైన ఆత్రేయపురంనకు సమీపంలో వాడపల్లి ఉంది. యాత్రికులు రాజమండ్రి నుంచి 30కిలో మీటర్లు, ఐదవ జాతీయ రహదారిలో రావులపాలెంనుండి 8 కిలోమీటర్లదూరంలో ఉన్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి బస్సులలో చేరుకోవచ్చు. రావులపాలెం నుంచి ఆటోల ద్వారా చేరుకోవచ్చు. దీనికి ప్రత్యేకించి రైలు రూటులేదు. రావులపాలెం, రాజమండ్రి నుండి ఆర్.టి.సి తీర్థం సమయంలో ప్రత్యేక సర్వీసులు నడుపుతుంది. వాడపల్లి గ్రామాలు ఒకటికి మించి ఉండుటచే ఇక్కడకు రావాలనుకొనే యాత్రికులు ఒక్కోసారి మరో వాడపల్లి వెళుతుంటారు. ఈ ఇబ్బందులు తొలగించడానికి దీనిని చినవాడపల్లి లేదా లొల్లవాడపల్లిగా పేర్కొంటారని స్థానికులు చెపుతుంటారు. పొద్దుపోయాక ఇక్కడకు వచ్చే యాత్రికులకు వసతులులేవు. వాడపల్లి నుంచి రావులపాలెం వెనుకకువెళ్ళి హోటళ్ళు లాడ్జీలలో బసచేస్తారు. దూర ప్రాంతయాత్రికుల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో ఇటీవల ఆలయకార్యనిర్వహణాధికారి, పాలకవర్గం. "శాశ్వత నిత్య అన్నదాన పథకం" ప్రవేశపెట్టి దూరప్రాంతపర్యాటకుల ఇబ్బందులు తొలగించింది. గోదావరి తీరాన వెలసిన స్వామి వారి ఆలయంతోపాటు, సమీపంలో "ర్యాలి" గ్రామంలో జగన్మోహిని కేశవస్వామి ఆలయం మరియు ఈ ప్రాంత పూలతోటలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలుగచేస్తాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు పురావస్తుశాఖ, టూరిజంశాఖ ఈప్రాంత ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సి ఉందని స్థానికులు విన్నవించుకొంటున్నారు.

ఏప్రిల్ 19 నుంచి 25 వరకు జరిగే వాడపల్లి తీర్థ మహోత్సవాలలో సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని రాజమండ్రి, అమలాపురం, రాజోలు, రావులపాలెం, కాకినాడ తదితర ప్రాంతాల డిపోలనుంచి ఆర్.టి.సి. ప్రత్యేక సర్వీసులు నడిచేందుకు సమాయుత్తమైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.వి. ఎస్.ఎన్. మూర్తి భక్తులకు అన్ని నదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టేందుకు సమాయుత్తమవుచున్నారు. ★

'కనువిందు చేసిన సురభి నాటకోత్సవాలు'

తెలుగు నాటక రంగ ప్రస్థానంలో 'సురభి' సంస్థలది ప్రత్యేక స్థానం. తెలుగు నాటకరంగం మహోన్నతమైన దశలను దాటిది. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశిష్టమైంది, మనదైన మాత్రమే సారితమైంది పద్యం.

విస్సా శేషగిరిరావు

ఆంధ్రుల సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే పద్యనాటకాన్ని బతికించుకునే క్రమంలో 'సురభి' కళాకారులు నిర్వహిస్తోన్న పాత్ర అపూర్వమైంది. వారి జీవితాలను నాటకానికి అంకితం చేసి 'జీవితమే ఒక రంగ స్థలం' అనే పదానికి సాక్షిగా నిలిచిన త్యాగజీవులు వారు. సురభి సంస్థల్లో ఒకటైన 'శ్రీ వినాయక నాట్య మండలి' హైదరాబాద్ కళాకారులు విజయవాడ నగరంలో 'సురభి నాటకోత్సవాలు' పేరుతో వారం రోజుల పాటు ప్రదర్శించిన నాటకాలు నగర ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలోని గోకరాజు లైలా గంగరాజు కళావేదికపై ఫిబ్రవరి 21న ప్రారంభమైన ఈ ఉత్సవాలు వారం రోజుల పాటు సాగాయి. 'సురభి' నాటకం అనగానే నగరం నలుమూలల నుంచి కూడా నాటక ప్రియులు తరలివచ్చారు. కుర్చీలు లేకపోయినా వయోభేదం మరిచి నేలపై కూర్చొని నాటకాలను తిలకించారు. నాటకాలకు ఆ ఏడు రోజులు ప్రేక్షకుల స్పందన నాటకకర్తలకు, రంగస్థల కళాకారులకు ఉత్సహ, ప్రోత్సాహాలను అందించిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. 'సురభి' అనగానే వెంటనే మనకు స్ఫూరించేది వారు చేసే జిమ్మిక్కులే. ఆయా నాటకాల్లో వారు ప్రదర్శించిన మాయలు చిన్నారులనే కాకుండా పెద్దలను కూడా అబ్బురపరిచాయి. వారం రోజుల పాటు 70 మంది కళాకారులు తమ ప్రతిభా పాటవాలతో ప్రేక్షకులకు కనువిందు చేశారు. సురభి కుటుంబాల్లోని మూడు సంవత్సరాల చిన్నారుల నుంచి పండు ముదుసలి వరకూ నాటకాన్ని రక్తికట్టించడంలో వారు పడే తపన వర్ణించలేనిది. మొదటి రోజు 'శ్రీకృష్ణలీలలు' నాటకం ప్రదర్శితమైంది. భాగవతం కథలో కంసుడు పెట్టే ఇబ్బందులు తాళలేక దేవతలందరూ వైకుంఠంలోని విష్ణువుని ప్రార్థించే సన్నివేశంతో నాటకాన్ని ప్రారంభించారు. తెర తీయగానే అద్భుతమైన వైకుంఠంలోని సన్నివేశ దృశ్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడు పాత్రల్లో అడుగులు కూడా సరిగా పడని చిన్నారుల రాగాలాపన ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. రెండో రోజు చారిత్రిక కథగా చెప్పుకునే 'బాల నాగమ్మ'ను ప్రదర్శించారు. ఇందులో బాల నాగమ్మ అక్క చెల్లెలుగా ఏడుగురు చిన్నారుల నటన ఈ నాటకానికి హైలెట్‌గా చెప్పవచ్చు. రెప్పపాటు కాలంలో రంగాలంకరణ మార్పు ప్రేక్షకులను మరపించింది. అలాగే ఇందులో మాయ మరాఠి పాత్ర ప్రేక్షకులను అలరించింది. మూడో రోజు 'మాయా బజార్' నాటకం ప్రదర్శించారు. ఇందులో శశిరేఖను మంచంతో సహ పైకి తీసుకెళ్లడం వంటి సన్నివేశాలు వినోదాన్ని పంచడమే కాకుండా సురభి ప్రతిభకు అద్దం పట్టాయి. మాయ శశిరేఖగా రూపం దాల్చిన ఘటోత్కచుడు లక్ష్మణ కుమారుడిని ఆట పట్టించడం, పెళ్లి మండపంలో చిత్ర విచిత్రాలు చేయడం తదితర సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. తరువాత రోజు 'సమ్మక్క సారక్క' చారిత్రక నాటకం ప్రదర్శించారు. ఇందులో తెలంగాణ ప్రాంతంలో గిరిజన గ్రామ దేవతలైన సమ్మక్క సారక్క జీవిత ఘట్టాలను కళాకారులు చక్కగా వివరించారు. తెలంగాణ ప్రాంతంలో నాటి భూస్వాముల, పెత్తాందార్ల అరాచకత్వాన్ని కళాకారులు కళ్లకు కట్టారు. అలాగే సమ్మక్క సారక్క జాతరకు దారి తీసిన అంశాలను కళాకారులు ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. 'సీతాకళ్యాణం'లో కళాకారులు ప్రదర్శించిన వలు అంశాలు ప్రేక్షకులకు మధురానుభూతులను అందించాయి. వారం రోజుల పాటు జరిగిన ఈ నాటకోత్సవం పద్య నాటకాలపై ప్రజలకున్న అభిరుచిని స్పష్టం చేసింది. ప్రతి నాటకానికి అధిక సంఖ్యలో హాజరైన ప్రేక్షకుల్లో చాలామంది యువతరం ఉండటం రానున్న కాలంలో నాటకానికి మరింత మంచి రోజులు వస్తాయని తెలుస్తోంది.

'బాలనాగమ్మ' నాటకంలో


'బాలనాగమ్మ' నాటకంలోని చిన్న నాటి ఏడుగురు అక్కచెల్లెలు

ఏడాదిలో అన్ని రోజులు నాటక ప్రదర్శనలుండాలి : మూర్తిరాజు

ఏడాదిలో ప్రతి రోజూ నాటక ప్రదర్శనలున్నప్పుడే నాటకం బతికి బట్ట కడుతుందని ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి మూర్తిరాజు అన్నారు. సురభి నాటకోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మూర్తిరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు నాటకానికి సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడం వలన కళాకారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. పాశ్చాత్య దేశాల్లో నాటకానికి నెలల ముందే వేలాది రూపాయలు చెల్లించి టిక్కెట్లను బుక్ చేసుకుంటారన్నారు. శ్రీ వినాయక నాట్యమండలి సంస్థ కార్యదర్శి ఆర్. వేణుగోపాలరావు మాట్లాడుతూ నాటకానికి మంచి ఆదరణ ఉందన్నారు. విజయవాడలో తాము ప్రదర్శించిన నాటకాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని చెప్పారు. అయితే ఆర్థికంగా ఆశించినంత ప్రోత్సాహం లభించలేదన్నారు. సుమారు 70 మంది కళాకారులు ప్రదర్శనలో పాల్గొనటం వలన ఖర్చులు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ అయ్యగారి శ్యామ్‌సుందర్ పర్యవేక్షించారు. ★

రెక్కలు

ఈ ఉషస్సు ఎరుపు
మాపటి సంజ నలుపు
ఊసరవెల్లి కాలం!

అనుభవించక తప్పనిది లేమి
వెంట తీసుకెళ్లలేనిది కలిమి
మాయలెక్క జీవితం!

ముందు కెళ్లడం తెలికే
వెనక్కి మళ్లడమే కష్టం
గతం ఖైదు!

సముద్రంలో భూభాగంలా
దుఃఖంలో సంతోషం
కాగితం పడవ మనిషి!

పంచాంగం పాటించినా
శకునం పట్టి నడిచినా
పూలదారి కాదుబతుకు!

నువ్వూహించినంత భ్రమించినంత
గొప్పదికాదు జీవితం
అది దారినపోయే దానయ్య!

– యం.కె. సుగమ్ బాబు

కెరటాలు

సాహిత్యం సంగీతం కలగలిసిన
ప్రవాహ ప్రపంచం నాది
ఆ సముద్రంలో
నా ప్రపంచాన్ని వెతుక్కుంటూ
పయనిస్తుంటాను అనుక్షణం!
నా జీవితాన్ని
తీర్చిదిద్దింది సాహిత్యమయితే
నా గేయాలకు లేపనమై
నన్ను సప్తసముద్రాల కెరటాలపై
ఓలలాడించి నన్ను
జోలపాపలా సాకింది సంగీతమే! అవును
నీలోనూ సంగీత సముద్రముంది
నీ బుగ్గపై నేను చీటికెవేసి
నీ గుండెకు చెవినాన్చి విన్నప్పుడు
నీలోని సంగీతం
నా హృదయంలో తరంగమై మ్రోగింది! నీవు
నీలోకి తొంగి చూసుకో ఒకసారి
నీ శక్తి ఏమిటో
నీకు బోధపడుతుంది! మరోసారి!!

– మహమ్మద్ ఖాన్

ఉగాది కవిత

తీపి – చేదు
మంచి – చెడు
వెలుగు – చీకటి
ఇదే మనిషి జీవితం
తగు పాళ్ళలో ఉంటేనే దీనికర్థం
ఉగాది పచ్చడి పరమార్థం!
యజమానులు, పెట్టుబడిదారులు
సామ్రాజ్యవాదులకే దక్కెను
తీపి, మంచి, వెలుగు ఫలాలు
కార్మికులు, కర్షకులు ఉద్యోగులకు మిగిలెను
చేదు, చెడు, చీకటి గుర్తులు
విదేశీ మోజులో పాలకులు
ప్రపంచబ్యాంకు బానిసలు
ఆంగ్ల సంవత్సరాదిపైనే క్రేజు
తెలుగు సంవత్సరాదిపై లేదు మోజు
దోపిడి పోయినరోజు
ప్రజలు సుఖశాంతులతో ఉన్నరోజు
సమసమాజం స్థాపించబడిన రోజు
నిజమైన ఉగాది రోజు
అందుకే
కొత్త ఆశయాల సాధన కోసం వేద్దాం పునాదిని
స్వాగతిద్దాం శ్రీ పార్థివ ఉగాదిని.

– ఎం. హెచ్. రహమాన్

ఉగాది పచ్చడి

ఇంట్లోపలికి దూసుకొచ్చిన
'సామ్రాజ్యవాదం'
నన్ను, నాకుటుంబాన్నీ
పచ్చడి పచ్చడి చేస్తున్నపుడు
ఇంకెలా చేసుకోను 'ఉగాది పచ్చడి'
పచ్చడి చేసుకోవాలని
నీళ్ళకోసమని వెళ్ళా–
కడివెడు 'ఫ్లోరిన్' దొరికింది!
బెల్లం కోసమని వెళ్ళా
రేట్ల పట్టిక పై...
గ్లోబల్ మార్కెట్ విషసర్పం
వికటాట్ట హాసం
వేపపువ్వు కోసమని వెళ్ళా –
వేపచెట్టు నాదంటూ ఆఖరి బుసకొడుతూ
'అమెరికా' అనకొండ!
పాలకుల పాలన 'కారం'గా
అమెరికా సామ్రాజ్యవాదం 'పులుపు'గా
ఉరితాళ్ళు, పురుగు మందులే 'తీపి'గా
అప్పులోళ్ళ వేదింపులే 'చేదు'గా
అధికధరల ఈసడింపులే 'వగరు'గా
రెక్కాడి చిందించిన చెమట 'ఉప్పు'గా
నా బతుకు షడ్రుచుల క్షేత్రమై...
'పచ్చడి'గా మారిపోయింది!
"ఉగాది పచ్చడి" ఇంకెందుకు?!

– పల్లె మణిబాబు

ఉగాది కవితల పోటీలో
సాధారణ ప్రచురణకు
ఎన్నికయిన కవితలు

పార్థివానికి స్వాగతం

సునామీ బీభత్సానికి గురైన
అనాథుల ఆర్తనాదాలతో
సకాలంలో వరుణుడు వర్షించక
ఆర్థిక ఇబ్బందులతో
పుడమితల్లిని నమ్ముకున్న
అన్నదాతల ఆత్మహత్యలతో
చేనేత కార్మికుల చిక్కుబడిన జీవితాలు
ఛిద్రంగా మారిన 'తారణనామ' సంవత్సరానికి
వీడ్కోలు పలికి
క్రొత్త ఆశలు, ఆశయాలతో
'పార్థివనామ' సంత్సరానికి స్వాగతం [illegible]
ఉప్పెనలు, ఉపద్రవాలు రక్తపాతాలు లేని
సస్యశ్యామలమవ్వాలని [illegible]

– బాసంగి [illegible]

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

విడాకులు ఆలస్యమైతే పిల్లలకు ఇబ్బందా?

నేను ఒక బ్యాంక్ ఉద్యోగిని. నాకు 80 సంవత్సరాలు. తల్లి ఇంట్లో ఆడదిక్కులేక పెద్దవాళ్ళు కలిసి నాకు మరోపెళ్ళి చేసినారు. నా భార్య ఇద్దరు మగపిల్లలతో కలసి నాతో విడిపోయి 10 సంవత్సరములు అయింది. ఆమె కోర్టు ద్వారా భరణం పొందుచున్నది. రెండవ భార్యకు ఇద్దరు ఆడపిల్లలు. నాకు కోర్టులో విడాకులు లేటుగా మంజూర్ అయినందున ఆడపిల్లలకు భవిషత్తులో ఏమైన ఇబ్బందులు వస్తాయా తెలుపగలరు.

శంకర్

హైదరాబాదు.

మీ విడాకులు అలస్యానికి, పిల్లల భవిష్యత్తులో ఎటువంటి ఆటంకాలు ఎదురుకావు.

మిలిట్రీలో చేరవచ్చా?

మిలిటరీలో పదవ తరగతి అయిపోయిన తరువాత చేరవచ్చా నాకు ఆ అర్హత ఉందా! తెలుపగలరు.

శీలం నరేంద్రకృష్ణారెడ్డి

మండలం (వైరా) గ్రామం (వైరా)

మిలిట్రీలో పదవతరగతి పాసయితే సాధారణ సైనికుడిగా చేరవచ్చు. అవి ప్రతి సంవత్సరము వివిధ జిల్లాలో క్యాంపులు నిర్వహించి సెలక్షన్స్ చేస్తుంటారు. అవి ఎప్పుడో పేపర్లో చూసి తెలుసుకొని ప్రయత్నించండి.

సమాన ఆస్థి హక్కుంది

మా నాన్నగారు చనిపోయారు. మేము ఇద్దరు అక్కా చెల్లెళ్ళు ఒక తమ్ముడు. నాకు మా చెల్లికి పెళ్ళిళ్ళు అయ్యాయి. తమ్ముడికి పెళ్ళికాలేదు. సంబంధాలు చూస్తున్నాము. ప్రస్తుతం మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. తమ్ముడు ఉద్యోగం చేస్తున్నాడు. మా నాన్నకు 5 ఎకరాలు భూమి రెండు ఇళ్ళు ఉన్నాయి. ఆస్తులు ఇల్లు మొత్తం 10 లక్షల రూపాయలు విలువ చేస్తాయి. మేము మా నాన్న ఆస్తిలో తమ్ముడితో సమానంగా ఆస్తి పంచమని అడుగుదామని అనుకుంటున్నాను. మా తమ్ముడితో సమానంగా మా చెల్లికి నాకు ఆస్తిలో సమానంగా వాటా వస్తుందా లేదా? సమానంగా వాటా వచ్చేందుకు ఏంచెయ్యాలి? మీరు సలహా ఇవ్వగలరు.

ఒక పాఠకురాలు.

మీకు మీ సహోదరికి మీ తమ్ముడితో సమానంగా వాటా ఉంటుంది. మీరు మీ తమ్ముడికి మీ పరిస్థితి వివరించి అంగీకరించేటట్లు చేసుకుంటే మంచిది. అతను ఒప్పుకోకున్నా మీరు న్యాయస్థానం ద్వారా సమాన వాటా పొందవచ్చును.

మీలా లాయరవ్వాలనుంది

నేను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాను. ఇంటర్ తరువాత "లా" చేయాలని ఉంది. అందుకు మీ యొక్క సలహా కోరుతున్నాను. ఇంటర్ తరువాత చేస్తే బాగుంటుందా లేదా డిగ్రీ తరువాత చేస్తే బాగుంటుందా. ఎన్ని సంవత్సరాలు ఉంటుంది. ఎంత ఖర్చు అవుతుంది. అర్హతలు, మార్క్స్ ఎన్ని రావాలి. అప్లికేషన్స్ ఎప్పుడు, ఎక్కడ దొరుకుతాయి. ఈ కాలేజీలు ఎక్కడెక్కడ ఉన్నాయి. ముందుకు మంచి భవిష్యత్ ఉంటుందా. తెలుపగలరు.

ఎస్. సాయిరామ్

పెనుకొండ, అనంతపురం.

మీరు ఇంటర్ విద్యార్థి మీరు 'లా' చేయాలనుకుంటే 5 సం॥ లా డిగ్రీచేయండి. దాంతో మీకు రెండు లాభాలు. ఇంటర్ తర్వాత అయితే 5 సంవత్సరాలు లా డిగ్రీ. డిగ్రీ తరువాత అయితే 3 సంవత్సరములు కోర్సు ఉంటుంది. మీరు డిగ్రీ తరువాత చేయాలనుకుంటే డిగ్రీ 3 సంవత్సరములు మరియు లా డిగ్రీ మూడు సంవత్సరములు మొత్తం ఆరు సంవత్సరములు ఉంటుంది. ఇంటర్ తర్వాత 5 సంవత్సరములు అంటే ఒక సంవత్సరము అకాడమిక్ ఇయర్ కలిసి వస్తుంది. మీరు ఏ లా డిగ్రీ చేయాలనుకున్నా 'లాసెట్' ఎంట్రెన్స్ తప్పనిసరి. ఎంట్రెన్స్ టెస్ట్‌లో క్వాలిఫై అయితే ఏ 'లా' కాలేజిలోనైనా సీటుపొందవచ్చు. అప్లికేషన్స్ మొన్నటివరకు ఇచ్చారు. మీరు మీ దగ్గరలోని యూనివర్సిటీలో తెలుసుకోండి. అప్లికేషన్స్ పంపించాల్సిన చివరితేది ఈ నెలలోనే ఉన్నది. పోస్టాఫీసుల్లో కూడా అప్లికేషన్‌లు దొరుకుతాయి. మీరు శ్రీకృష్ణ దేవరాయయూనివర్సిటీలో లా డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోండి. ఈ ప్రొఫెషన్‌లోకి రావాలనుకుంటే మాత్రం ఓపిక చాలా అవసరం. అనుకున్నంత ప్రజాసేవకూడా అవకాశం ఉంటుంది. డిగ్రీకయ్యే ఖర్చు లా డిగ్రీకి సంవత్సరం వచ్చేసి సమానంగానే ఉంటాయి.

గట్టి గారెలు

తయారుచేసే విధానం: మినపప్పు, పచ్చి శనగపప్పు నాలుగు గంటలు నానబెట్టాలి. వాటిని శుభ్రంగా కడిగాలి. మినపప్పును కచ్చాపచ్చాగా రుబ్బుకోవాలి. చేతితో పట్టుకుంటే ముద్దకు వస్తే చాలు. పచ్చిమిర్చి, అల్లం మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని మినపపిండిలో కలపాలి. పచ్చి శనగ పప్పు కూడా నీళ్ళు పూర్తిగా వడలిన తరువాత ఇందులో కలపాలి. జీలకర్ర, సన్నగా తరిగిన కరివేపాకును కూడా ఇందులో కలపాలి. బాండీలో నూనెపోసి కాగిన తరువాత దీనిని పాలిథిన్ పేపర్ మీద పల్చగా గారెలు చేసి ఎర్రగా కాలనివ్వాలి. ఇవి కరకరలాడుతూ చాలా రుచిగా ఉంటాయి. వారం రోజులు నిల్వ ఉంటాయి.

కావలసిన వస్తువులు:

మినప్పప్పు	:	ఒక కిలో
పచ్చిశనగ పప్పు	:	పావు కిలో
పచ్చిమిర్చి	:	50 గ్రాములు
అల్లం	:	50 గ్రాములు
జీలకర్ర	:	రెండు టీ స్పూన్లు
కరివేపాకు	:	ఆరు రెమ్మలు
నూనె	:	వేయించడానికి

రవ్వ చక్రాలు

కావలసిన వస్తువులు:

బియ్యం పిండి	:	నాలుగు కప్పులు
బొంబాయి రవ్వ	:	రెండు కప్పులు
డాల్డా	:	రెండు స్పూన్లు
వాము	:	ఒక స్పూను
జీలకర్ర	:	రెండు స్పూన్లు
తెల్ల నువ్వులు	:	రెండు స్పూన్లు
ఉప్పు	:	తగినంత
కారం	:	తగినంత
నూనె	:	వేయించడానికి

తయారుచేసే విధానం: బియ్యం పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. ఇందులో బొంబాయి రవ్వ, డాల్డా, వాము, జీలకర్ర, తెల్ల నువ్వులు, ఉప్పు, కారం అన్నీ వేసి చక్రాల పిండిలా కలుపుకోవాలి. బాండీలో నూనె పోసి కాగిన తరువాత ఈ పిండిని చక్రాల గిద్దలతో చక్రాలు చేయాలి. ఈ చక్రాలు మామూలుగా తినడానికి, అన్నంలో నంజుడుగా కూడా రుచిగా ఉంటాయి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : కె.మమత
వయసు : 12సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు: కలం స్నేహం చేయడం, బొమ్మలేయడం
చిరునామా:
కె.మమత, డాటరాఫ్ కె.అంజాగౌడ్, షాద్‌నగర్, గొర్రెకల్ (పోస్ట్), అల్లాదుర్గ్ (మం), మెదక్. -502269.

పేరు : అప్పిడి వెంకట రమణారెడ్డి
వయసు : 9సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: సైకిల్ తొక్కడం, న్యూస్ చదవడం, క్రికెట్ ఆడటం
లక్ష్యం: డాక్టర్ కావడం.
స్కూలు: సిద్ధార్థ హైస్కూల్
చిరునామా: **అప్పిడి వెంకట రమణారెడ్డి,** సన్నాఫ్ చంద్రారెడ్డి, దేవరుప్పల, వరంగల్ - 506 302.

పేరు : ఎల్.పృథ్వీరాజ్
వయసు : 7 సం॥
చదువు : 2వ తరగతి
హాబీలు: ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి చదవడం
లక్ష్యం: డాక్టర్ కావడం.
చిరునామా: **ఎల్.పృథ్వీరాజ్,** సన్నాఫ్ దేశ్యానాయక్, నర్సాయపల్లి, బల్మూరు (మం), అచ్చంపేట (తా) మహబూబ్‌నగర్ -509401.

పేరు : పేట శశిరేఖ
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు: పుస్తక పఠనం, బొమ్మలు వేయడం
చిరునామా:
పేట శశిరేఖ
గాజీనగర్ (గ్రామం)
దేవరకొండ (మం)
నల్లగొండ,
508248.

పేరు : భైరాపురం శారద
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు: సంగీతం వినడం, నాట్యం చేయడం
స్కూలు: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల
చిరునామా: **భైరాపురం శారద,** డాటరాఫ్ నర్సింహ, నిజాంనగర్ (గ్రా), కందుకూరు (పో), డిండి (మం), నల్లగొండ.

పేరు : బి.రవీంద్రారెడ్డి,
వయసు : 15సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు: చదవడం, రాయడం, క్రికెట్ ఆడటం, జోక్స్ వేయడం, ప్రజాశక్తి చదవడం
చిరునామా:
బి.రవీంద్రారెడ్డి, సన్నాఫ్ వీరారెడ్డి, రామాపురం, దాచేపల్లి (మం), గురజాడ(తా), గుంటూరు.

పేరు : ఎస్‌కె.కరీంబాషా
వయసు : 12 సం॥
చదువు : 7వ తరగతి
హాబీలు: కవితలు రాయడం
లక్ష్యం: ఐపిఎస్ కావడం
చిరునామా:
ఎస్‌కె.కరీంబాషా, సన్నాఫ్ మాలిబాషా, జడ్‌పిహెచ్‌ఎస్, కొత్తపట్నం.

పేరు : సిహెచ్ లక్ష్మీదుర్గ
వయసు : 7 సం॥
చదువు: 2వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, డ్రాయింగ్ వేయడం, జోక్స్ చెప్పడం
లక్ష్యం: టీచర్ కావడం.
చిరునామా:
సిహెచ్. లక్ష్మీదుర్గ, డాటరాఫ్ రాజారావు, కేరాఫ్ నవ్యటైలర్స్ హౌస్ నెం.77-31-13 శాంతినగర్, విజయవాడ -15.